

2004 నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు, కేంద్ర ప్రభుత్వ అనుమతి ఉన్నా గత ప్రభుత్వం జీవో విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 10,715 మందిని ఓపీఎస్ నుంచి జీపీఎస్ పరిధిలోకి తీసుకొచ్చింది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

బుధవారం 11.11.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 200 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



పారిశ్రామిక ప్రగతికి బాటలు

ఏఐ డేటా సెంటర్‌కు రూ.31,387 కోట్లు | **ఎలక్ట్రానిక్స్, బ్యాటరీ పరిశ్రమలకు అనుమతులు** | **కొత్త పారిశ్రామిక విధానాలకు ఆమోదం** | **34 అంశాలపై మంత్రివర్గం నిర్ణయాలు**



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసి, దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే దిశగా రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో 34 అజెండా అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేసింది. ఐటీ, కృత్రిమ మేధ, రోబోటిక్స్, సెమీకండక్టర్, గ్రీన్ ఎనర్జీ, విద్యుత్, పట్టణాభివృద్ధి, పోలీసు వ్యవస్థలకు సంబంధించి పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

భవిష్యత్తు సాంకేతికరంగాల్లో రాష్ట్రాన్ని ముందంజలో నిలిపే లక్ష్యంతో మూడు కీలక పారిశ్రామిక విధాన నిర్ణయాలు తీసుకుంది. 2026-31 కాలానికి ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ విధానాన్ని, 2026-2036 కాలానికి రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ విధానాన్ని ఆమోదించింది. సెమీకండక్టర్, డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 4.0లో సవరణలకు కూడా మంత్రివర్గం అంగీకారం తెలిపింది.

డేటా సెంటర్లు.. పరిశ్రమలకు భారీ పెట్టుబడులు : అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఈ-ప్యాక్ డేటా సెంటర్ సొల్యూషన్స్ సంస్థ మాడ్యులర్ ఎక్విప్‌మెంట్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అనుమతి పొందింది. రూ.570.20 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అదానీ క్లౌడ్ హబ్ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నివేదికను కూడా కేబినెట్ పరిశీలించింది.

తిరుపతి జిల్లా నాయుడుపేటలో కార్బన్ కాస్మో సంస్థ రూ.4,000.20 కోట్ల పెట్టుబడితో ఎల్ఎఫ్‌పీ ప్రీకర్సర్, క్యాథోడ్ మెటీరియల్స్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఈ యూనిట్ ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. తిరుపతిలో డిక్సన్ సంస్థ రూ.700 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా కేబినెట్ అనుమతించింది. ఈ ప్రాజెక్టు ద్వారా 2,300 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

భీమిలిలో అమానం సంస్థ 512 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.31,387 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. భోగాపురంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఏఐ డేటా సెంటర్‌కు భూముల బదలాయింపు ప్రతిపాదనకూ ఆమోదం లభించింది.

రాపలి స్పిన్నర్స్ పరిశ్రమ విస్తరణకు కూడా కేబినెట్ అనుమతించింది. రూ.236.92 కోట్లతో చేపట్టనున్న విస్తరణ పనుల ద్వారా 1,569 మందికి ఉపాధి లభించనుంది. రాధీ గ్రీన్ ఎనర్జీ, న్యూల్యాండ్ ల్యాబ్స్ సంస్థలకు ప్రోత్సాహకాలు మంజూరు చేసే ప్రతిపాదనలకు కూడా ఆమోదం తెలిపింది.

వ్యర్థాల నుంచి విద్యుత్.. గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహం : విజయవాడలో 15 మెగావాట్ల సామర్థ్యంతో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంటు ఏర్పాటుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ కేంద్రంలో రోజుకు 1,023 టన్నుల చెత్తను ప్రాసెస్ చేయనున్నారు. ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన జెన్‌కోకు చెందిన 5.50 ఎకరాల భూమిని విజయవాడ నగరపాలక సంస్థకు ఉచితంగా బదలాయించేందుకు ఆమోదం తెలిపింది.

చిన్న మాడ్యులర్ రియాక్టర్ల సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అణు విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటులో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యానికి అనుమతించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు కూడా అనుమతులు మంజూరు చేసింది. గ్రీన్‌కో సౌర విద్యుత్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 500 మెగావాట్ల నుంచి 1,500 మెగావాట్లకు పెంచేందుకు ఆమోదం తెలిపింది.

సెంబ్‌కార్ప్ సంస్థకు సంబంధించిన రూ.48.73 కోట్ల వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ప్రతిపాదనను నిర్దేశిత షరతులకు లోబడి క్రమబద్ధీకరించింది.

పోలీస్ వ్యవస్థలో ప్రత్యేక డైరెక్టరేట్ : రాష్ట్రంలో ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రతను మరింత సమర్థంగా పర్యవేక్షించేందుకు మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో

మిగతా 3లో...

గ్రూప్-2లో 720 ఉద్యోగాలు..

- ఏపీపీఎస్సీ పూర్తిస్థాయి నోటిఫికేషన్ విడుదల
- 686 నుంచి 720కి పెరిగిన ఖాళీలు
- డిసెంబరు 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 21న ప్రిలిమినరీ పరీక్ష

అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ పూర్తిస్థాయి నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో ప్రకటించిన 686 ఖాళీలను 720కి పెంచుతూ తాజా నోటిఫికేషన్‌లో వివరాలను వెల్లడించింది. మొత్తం పోస్టుల్లో 471 ఎగ్జిక్యూటివ్, 249 నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు ఉన్నాయి.

క్వాంటం కంప్యూటర్‌కు ప్రాధాన్యం



- ఫిబ్రవరి 3న క్వాంటం కంప్యూటర్ ప్రారంభం
- ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీకి ఆహ్వానం
- 11 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- 15 శాతానికి పైగా వృద్ధిరేటు సాధించాలి: సీఎం

మిగతా 2లో...

బీమాతో నిమిత్తం లేకుండా పరిహారం



• వివరాలు 2 లో

- పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి
- ఎర్రకాలువ వరద బాధితులకు తక్షణ సాయం
- నష్టాలపై సమగ్ర అంచనా వేయాలి
- సీఎం చంద్రబాబుకు మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి

పంట నష్టం నమోదు వేగవంతం



- ఆర్నాబ్, మురసుతో భారీగా దెబ్బతిన్న పంటలు
- అర్హులెవరూ పరిహారం కోల్పోవద్దు
- వ్యవసాయ అధికారులకు అచ్చెన్నాయుడు ఆదేశాలు

3 లో

స్థానిక సంస్థల్లో కీలక ఘట్టం

- ఎంపీపీ, జెడ్పీ అధ్యక్ష పీఠాలకు ఎన్నికలు
- ఈ నెల 19, 20 తేదీల్లో ప్రత్యేక సమావేశాలు
- పార్టీ విప్ పరిధిలో ఎంపీపీ, జెడ్పీ ఎన్నికలు
- మార్గదర్శకాలు జారీ చేసిన ఎస్ఈసీ

అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : రాష్ట్రవ్యాప్తంగా మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) సభ్యుల ఎన్నికల పోలింగ్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 05.11.2026న నిర్వహించింది.

వెబ్‌ల్యాండ్ రికార్డుల హ్యాకింగ్..

- ఎన్ఐసీ అధికారుల లాగిన్ ఐడీల దుర్వినియోగం
- దొనకొండలో 6.55 ఎకరాలకు అక్రమ పట్టాలు
- రాష్ట్రవ్యాప్తంగా 30 రికార్డుల్లో అవకతవకలు
- సీఐడీకి చిక్కిన నలుగురు

అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : ప్రభుత్వ భూ రికార్డుల డేటాబేస్ వెబ్‌ల్యాండ్‌ను లక్ష్యంగా చేసుకుని అక్రమాలకు పాల్పడిన ముఠాను సీఐడీ అధికారులు పట్టుకున్నారు. ఎన్ఐసీ అధికారికి చెందిన యూజర్ ఐడీని దొంగిలించి, రెవెన్యూ శాఖ అనుమతి లేకుండానే భూముల వివరాలను మార్చిన వ్యవహారంలో నలుగురిని అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లా దొనకొండ మండలంలో 6.55 ఎకరాల భూమికి సంబంధించిన రికార్డులను ఈ ముఠా అక్రమంగా మార్చినట్లు సీఐడీ గుర్తించింది. తహసీల్దార్ల

మిగతా 2లో...



క్యాన్సర్ మందుల ధరలకు కళ్లెం

- ప్రతి రోగికీ తగ్గింపు ప్రయోజనం అందాలి
- పాత నిల్వలకూ కొత్త ధరలే వర్తింపు
- కొరత సృష్టించినా.. అధిక ధరలకు అమ్మినా చర్యలు
- అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశాలు

అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్‌ఫైల్) :క్యాన్సర్ మందుల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించిన నేపథ్యంలో ఆ ప్రయోజనం రోగులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మందుల లభ్యత, ధరల అమలుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఆసుపత్రులు, మందుల దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. పాత ధరలతో ముద్రించిన మందుల నిల్వలను సైతం తగ్గించిన ధరలకే విక్రయించాలని పేర్కొన్నారు. మిగతా 2లో...

ఉద్యోగుల ఆత్మగౌరవమే ప్రభుత్వ ప్రాధాన్యం



- 11 వేలఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపిన కూటమి ప్రభుత్వం
- 63.6 శాతం పోస్టల్ బ్యాలెట్లతో ఉద్యోగుల మద్దతు
- 10,715 మందిని ఓపీఎస్ పరిధిలోకి తీసుకొచ్చాం
- ఉద్యోగుల సంక్షేమం, ఆత్మగౌరవ పరిరక్షణకు ప్రాధాన్యం
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

మంగళగిరి, నవంబర్ 10 (జర్నలిస్ట్‌ఫైల్) : స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు అందించిన ఘన విజయం ప్రభుత్వ పాలనపై వ్యక్తమైన విశ్వాసానికి నిదర్శనమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ ఎన్నికల్లో 63.6 శాతం మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా కూటమికి మద్దతు తెలిపారని పేర్కొన్నారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన

మిగతా 2లో...

పెట్టుబడుల పండుగకు విశాఖ సిద్ధం

- 12, 13 తేదీల్లో సాగర తీరాన సీఐఐ భాగస్వామ్య సదస్సు
- ప్రపంచ దేశాల ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాల రాక
- పారిశ్రామికవేత్తలు, విదేశీ ప్రతినిధులతో సీఎం వరుస భేటీలు
- ఒకరోజు ముందుగానే విశాఖకు చంద్రబాబు

అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్‌ఫైల్) : ఏపీని పెట్టుబడులకు, పారిశ్రామికాభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖపట్నంలో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026ను ప్రభుత్వం నిర్వహించనుంది. గతేడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సుకు భిన్నంగా 2026 సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఇప్పటికే ఐదు ప్రాంతీయ సదస్సులు నిర్వహణతో రూ.86 వేల కోట్ల పెట్టుబడులను వచ్చాయి. అలాగే వివిధ రంగాలపై ప్రాంతీయ సదస్సుల్లో చర్చలు జరిగాయి. దీంతో పెట్టుబడుల సదస్సులో ఎలాంటి చర్చలు జరుగుతాయోననే అంశంపై



అందరిలోనూ ఆసక్తిని రెకెత్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య సంయుక్తంగా చేపట్టనున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా పలుదేశాల ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు, దౌత్యవేత్తలు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, బహుళజాతి సంస్థల అధినేతలు హాజరుకానున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని, వివిధ దేశాల ప్రతినిధులు.మిగతా 2లో...

ఎస్సీ యువతకు ఉపాధే లక్ష్యం

- నైపుణ్య శిక్షణతో ఉద్యోగ అవకాశాలు
- 1,100 మంది నర్సింగ్ అభ్యర్థులకు శిక్షణ
- జర్మనీ, ఇజ్రాయెల్‌లో ఉపాధికి ప్రోత్సాహం
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

• వివరాలు 3 లో



బాలల హక్కులే ప్రామాణికం



- తండ్రి పేరు నిబంధనపై పునఃపరిశీలన
- తల్లి, సంరక్షకుల పేర్లకూ గుర్తింపు
- ప్రభుత్వ పోర్టళ్లలో మార్పులు చేయాలి
- అధికారులకు మార్గదర్శకాలు జారీ చేయాలి

3 లో

ఉద్యోగుల ఆత్మగౌరవమే ప్రభుత్వ ప్రాధాన్యం



(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఈ విజయానికి సహకరించిన రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి పాలకులు, ఉద్యోగ యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం అవసరమని, గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం, ఉద్యోగులు కలిసికట్టుగా చేసిన కృషి స్థానిక ఎన్నికల్లో విజయానికి పునాదిగా నిలిచిందని చెప్పారు.

ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆలపాటి విమర్శించారు. సుమారు రూ. 40 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, ఈఎల్, డీఏ వంటి ప్రయోజనాలు సకాలంలో అందలేదని ఆరోపించారు. జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. హెచ్‌ఆర్ఏ తగ్గించడంతో పాటు పీఎఫ్, కార్మిక సంక్షేమ నిధులను కూడా దారిమళ్లించారని విమర్శించారు.

చంద్రబాబు నాయకత్వంలోని గత టీడీపీ ప్రభుత్వం లోటు బడ్జెట్‌లోనూ ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత పాలనలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 30 వేల కోట్ల బకాయిలను చెల్లించి ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించిందన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను క్రమం తప్పకుండా జమ చేస్తున్నామని తెలిపారు.

10,715 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం : 2004 నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ఉద్యోగుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు, కేంద్ర ప్రభుత్వ అనుమతి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం జీవో విడుదల చేయలేదని ఆలపాటి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 10,715 మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పరిధిలోకి తీసుకొచ్చామని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 నుంచి 60 ఏళ్లకు, అనంతరం 62 ఏళ్లకు పెంచినట్లు తెలిపారు. కార్పొరేషన్ల ఉద్యోగులకు కూడా ఈ ప్రయోజనాన్ని వర్తింపజేశామన్నారు. ఓపీఎస్ పరిధిలోకి వచ్చిన ఉద్యోగులతో పాటు ఇప్పటికే పదవీ విరమణ చేసినవారు కూడా నమోదు చేసుకునేందుకు 'నిధి' పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. 2017లోనే జీవో ఎంఎస్ నంబర్లు 107, 121 ద్వారా సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ సౌకర్యాలను కల్పించినట్లు పేర్కొన్నారు. 2024 నుంచి 2027 వరకు ఉద్యోగులకు రావాల్సిన డీఏలను 16 విడతల్లో చెల్లించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. 10వ పీఆర్సీ బకాయిల కింద రూ. 50 వేలతో పాటు పీఎఫ్ ద్వారా రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు.

ఉద్యోగుల ఆత్మగౌరవమే ప్రభుత్వ ప్రాధాన్యం : కోవిడ్ సమయంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద క్యూలైన్ల నిర్వహణకు వినియోగించడం ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని ఆలపాటి విమర్శించారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్ర ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాలకులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో కూటమికి మద్దతుగా నిలిచిన ఉద్యోగులందరికీ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ రాష్ట్ర అభివృద్ధికి ఉద్యోగులు సహకరించాలని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

వెబ్‌ల్యాండ్ రికార్డుల హ్యాకింగ్..

(మొదటి పేజీ తరువాయి)

నుంచి మ్యుటేషన్ ఉత్తర్వులు లేకపోయినా కొత్త పట్టాదారుల పేర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

విజయవాడ ఎన్ఐసీలో ఔట్‌సోర్సింగ్ జూనియర్ డెవలపర్‌గా పనిచేస్తున్న సాయికుమార్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. సీనియర్ అధికారి జీవీఎస్ఆర్ శర్మకు చెందిన లాగిన్ ఐడీని దుర్వినియోగం చేసి డేటాబేస్‌లో మార్పులు చేసినట్లు అధికారులు నిర్ధారించారు. రెవెన్యూ అధికారుల ఆమోద ప్రక్రియను పూర్తిగా పక్కనపెట్టి నేరుగా కంప్యూటర్ రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్లు వెల్లడించారు.

ఈ వ్యవహారంలో నిందితుల మధ్య జరిగిన ఫోన్‌పే లావాదేవీలను సీఐడీ పరిశీలించి ఆధారాలు సేకరించింది. ప్రాథమిక దర్యాప్తులో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో అక్రమ మార్పులు జరిగినట్లు గుర్తించింది. ఈ అక్రమాల వెనుక ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

నిందితులపై బీఎన్ఎస్‌లోని ఫోర్జరీ, మోసం సంబంధిత సెక్షన్లతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 66 కింద కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ భూ రికార్డుల భద్రతకు సంబంధించిన ఈ వ్యవహారం రెవెన్యూ, సాంకేతిక విభాగాల్లో కలకలం రేపింది.

గ్రూప్-2లో 720 ఉద్యోగాలు..

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థులు నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ తెలిపింది. దరఖాస్తుల స్వీకరణకు డిసెంబరు 11ను తుది గడువుగా నిర్ణయించింది.

ఎగ్జిక్యూటివ్ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు 203, డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు 176, జీఎస్టీ ఆఫీసర్ పోస్టులు 40, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు 29 భర్తీ చేయనున్నారు. నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్వో) పోస్టులు 80, సీనియర్ అకౌంటెంట్ పోస్టులు 91 ఉన్నాయి.

డిగ్రీ అర్హత.. గరిష్ఠ వయోపరిమితి 44 ఏళ్లు : గ్రూప్-2 పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. సాధారణ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు మాత్రం 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి.

ఫిబ్రవరి 21న ప్రిలిమినరీ పరీక్ష : గ్రూప్-2 ప్రాథమిక పరీక్షను 2027 ఫిబ్రవరి 21న నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. ఆఫ్‌లైన్ ఓఎంఆర్ విధానంలో 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్‌లో ఓటీపీఆర్ నమోదు ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఉద్యోగాల సంఖ్య పెరగడంతో గ్రూప్-2 అభ్యర్థుల్లో ఆసక్తి నెలకొంది.

క్యాన్సర్ మందుల ధరలకు కళ్లెం



(మొదటి పేజీ తరువాయి)

అధిక ధరలకు విక్రయించడం, మందుల కొరత సృష్టించడం, అవసరానికి మించి నిల్వలు ఉంచడం వంటి అక్రమాలను అరికట్టాలని ఆదేశించారు.

దేశవ్యాప్తంగా 1364 క్యాన్సర్ నిరోధక ఔషధాల ధరలను సోమవారం నుంచి కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. 671 బ్రాండ్ల ధరల్లో 50 శాతం కంటే ఎక్కువ తగ్గింది. ఎంఆర్‌పీలో అత్యధికంగా 96.45 శాతం వరకు తగ్గింపు జరిగింది.

కేంద్ర ప్రభుత్వం తగ్గించిన ఈ క్యాన్సర్ మందుల ధరల అమలుకు తగ్గట్లు రాష్ట్రంలో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం కార్యదర్శి జి. వీరపాండియన్, ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రులు, మందుల దుకాణాల్లో ఇప్పటికే ఉన్న క్యాన్సర్ మందులను కూడా తగ్గించిన ధరలకే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మందుల కొరత సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

అవసరాలకు తగ్గట్టే మందుల కొనుగోలు : క్యాన్సర్ చికిత్స అందించే ఆసుపత్రులు రోగులకు సూచించిన మందులను తగినంతగా అందుబాటులో ఉంచాలని మంత్రి చెప్పారు. ప్రతి ఔషధానికి తగ్గించిన ధరతో కనీసం ఒక కంపెనీ మందు నిల్వ ఉండేలా చూడాలన్నారు. రోగులు తమ అవసరాలకు అనుగుణంగానే మందులను కొనుగోలు చేయాలని సూచించారు. అవసరానికి మించి భారీగా మందులు కొనుగోలు చేసి నిల్వ చేయడం వల్ల ఇతర ఆసుపత్రులు, రోగులకు మందులు అందకుండా పోతాయని పేర్కొన్నారు.

మరోవైపు, ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు జిల్లాలకు జారీ చేసిన విధివిధానాల్లో తగ్గించిన క్యాన్సర్ మందుల విక్రయాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పాత ధరలతో ఉన్న మందులను వెనక్కి పంపాల్సిన అవసరం లేదు : ఆసుపత్రుల మందుల విక్రయ కేంద్రాల్లో, వెబ్‌సైట్లలో తయారీ కంపెనీలు పంపిన సవరించిన ధరల జాబితా (ఫారం-$)ను ప్రదర్శించాలి. పాత ధర ముద్రించిన మందుల ప్యాకెట్లను తిరిగి పంపాల్సిన అవసరం లేదు. వాటిపై కొత్త ధర ముద్రించాల్సిన అవసరమూ లేదు. అయితే సవరించిన ధర లేదా ప్యాకెట్‌పై ముద్రించిన ధర.. ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ ధరకు మాత్రమే విక్రయించాలి. ప్రతి మందుకు సంబంధించిన బ్రాండ్ పేరు, బ్యాచ్ సంఖ్య, గరిష్ఠ చిల్లర ధర, వసూలు చేసిన మొత్తం వివరాలతో కూడిన బిల్లును రోగులకు ఇవ్వాలి. ఆసుపత్రుల మందుల విక్రయ కేంద్రాలు, క్యాన్సర్ చికిత్స విభాగాలు, డే కేర్ క్లినిక్‌లలో రోగుల హక్కులు, ఫిర్యాదుల విధానాన్ని తెలుగులో, ఆంగ్లంలో ప్రదర్శించాలి.

ఆసుపత్రుల తనిఖీలు : ప్రతి ఔషధ తనిఖీ అధికారి తన పరిధిలోని అన్ని క్యాన్సర్ ఆసుపత్రులు, చికిత్స కేంద్రాలను ఏడు రోజుల్లో తనిఖీ చేయాలి. ఆసుపత్రుల్లో సాధారణంగా వినియోగించే క్యాన్సర్ మందులు తగ్గించిన ధరలకు అందుబాటులో ఉన్నాయా, ప్రతి ఔషధానికి కనీసం ఒక కంపెనీ మందు నిల్వ ఉందా, ధరల జాబితా ప్రదర్శిస్తున్నారా అనే అంశాలను పరిశీలించాలి. నవంబరు 9 నుంచి తగ్గించిన ధరలకు మందులు విక్రయిస్తున్నారా లేదా తెలుసుకునేందుకు ప్రతి ఔషధానికి సంబంధించి ఇటీవల జారీ చేసిన బిల్లులను పరిశీలించాలి. పాత ధరలతో ముద్రించిన ప్యాకెట్లలో ఉన్న మందులను సైతం తగ్గించిన ధరలకే విక్రయిస్తున్నారా అనేది నిర్ధారించాలి.

సరఫరా ఏజెంట్ల వద్ద ధరల జాబితాల పరిశీలన : తయారీ కంపెనీల సరఫరా ఏజెంట్లు, సూపర్ స్టాకిస్టుల వద్ద ఔషధాల సవరించిన ధరల జాబితా (ఫారం-5) అందిందా లేదా ఔషధ తనిఖీ అధికారులు పరిశీలించాలి. నవంబరు 9 నుంచి జారీ చేసిన బిల్లుల్లో తగ్గించిన ధరలు నమోదు చేశారా, ఆ తేదీ నాటి నిల్వలు, ప్రస్తుత నిల్వలు ఎంత ఉన్నాయనే వివరాలను తనిఖీ చేయాలి.

ప్రస్తుత ధరల జాబితాలోని ధర లేదా ప్యాకెట్‌పై ముద్రించిన ధర.. ఈ రెండింటిలో ఏది తక్కువైతే దానికి అనుగుణంగా విక్రయాలు జరగాలి. అధిక ధర వసూలు చేయకూడదు.

మందులు అందుబాటులో లేకపోతే 24 గంటల్లో చర్యలు : ఆసుపత్రి, రోగి లేదా వారి సహాయకుల నుంచి మందులు అందుబాటులో లేవని ఫిర్యాదు వస్తే ఔషధ తనిఖీ అధికారి 24 గంటల్లో స్పందించాలి. జిల్లా సరఫరాదారుల జాబితా ద్వారా మందుల నిల్వ ఎక్కడ ఉందో గుర్తించి, ఆసుపత్రి లేదా రోగికి మందులు అందేలా చర్యలు తీసుకోవాలి.

అక్రమాలపై చట్టపరమైన చర్యలు: తగ్గించిన ధరల కంటే అధికంగా మందులు విక్రయిస్తే బిల్లులు, రికార్డులను అధికారం కలిగిన అధికారి స్వాధీనం చేసుకోవాలి. మందుల ధరల జాబితాను ప్రదర్శించకపోతే 24 గంటల్లో నిబంధనలు పాటించాలని లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వాలి. మందుల విక్రయాన్ని నిలిపివేయడం లేదా నిరాకరించడం వంటి సందర్భాల్లో ఫిర్యాదుదారు, వ్యాపారి వాంగ్మూలాలను నమోదు చేయాలి. అనుమతి లేని వ్యక్తులకు మందులు విక్రయించడం వంటి ఉల్లంఘనలపై నోటీసులు జారీ చేయాలి.


జిల్లా సహాయ సంచాలకులు తమ పరిధిలోని అమలును వ్యక్తిగతంగా పర్యవేక్షించాలి. క్యాన్సర్ ఆసుపత్రుల సంఖ్య, తనిఖీలు, సరఫరా ఏజెంట్లు, సూపర్ స్టాకిస్టుల వద్ద ధరల జాబితాల పరిశీలన, మందుల లభ్యతపై వచ్చిన ఫిర్యాదులు, 24 గంటల్లో పరిష్కరించిన ఫిర్యాదులు, అసాధారణ కొనుగోళ్లు, అధిక ధరల విక్రయాలు, విక్రయ నిరాకరణలు, అనుమతుల నిలిపివేత లేదా న్యాయ చర్యల వివరాలతో నివేదిక రూపొందించాలి.

ఫిర్యాదులు చేయాలంటే... : క్యాన్సర్ మందులు అందుబాటులో లేకపోయినా, తగ్గించిన ధర కంటే అధికంగా వసూలు చేసినా, మందులు ఇవ్వడానికి నిరాకరించినా రోగులు, ఆసుపత్రుల వారు ఔషధ నియంత్రణ శాఖకు ఫిర్యాదు చేయవచ్చని డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఔషధ నియంత్రణ శాఖ వాట్సాప్: 8632330909, ఈ-మెయిల్: dca-grams@ap.gov.in, ఎన్‌పీపీఏ టోల్‌ఫ్రీ నంబరు: 1800-111-255

పెట్టుబడుల పండుగకు విశాఖ సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)



ప్రముఖ పారిశ్రామిక సంస్థల అధినేతలతో సమావేశం కానున్నారు. నవంబర్ 12వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో సదస్సు ప్రారంభ కార్యక్రమం జరగనుంది. సదస్సు ప్రారంభం కార్యక్రమాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభిస్తారు. ఆ తర్వాత జరగనున్న వివిధ సెషన్లు... సమావేశాల్లో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు భాగస్వాములు కానున్నారు. అలాగే కీలక సమావేశాల్లో సీఎం చంద్రబాబు పాల్గొని... ఆయా అంశాలపై చర్చించడంతోపాటు... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను వివరించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అందుబాటులో ఉన్న అవకాశాలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక విధానాలు, తయారీ, సాంకేతిక రంగాల్లోని అవకాశాలను పారిశ్రామిక వర్గాలకు సీఎం వివరిస్తారు.

అంతర్జాతీయ ప్రతినిధులతో ముఖ్యమంత్రి భేటీలు : సీఐఐ సమ్మిట్‌లో భాగంగా ముఖ్యమంత్రి పలు దేశాల మంత్రులు, రాయబారులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతోనూ సమావేశమవుతారు. సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, గ్వాటెమాలా, స్లోవేకియా దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులతో సీఎం భేటీ కానున్నారు. అలాగే జపాన్, రష్యా రాయబారులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. వీరితో పాటు ప్రపంచ మేధోసంపత్తి సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డారెన్ టాంగ్‌తో కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఇక సదస్సులో ఆటోమొబైల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, నిర్మాణ సామగ్రి, మౌలిక సదుపాయాలు, మాన్యుఫ్యాక్చరింగ్, సాంకేతిక రంగాలకు చెందిన ప్రముఖులు భాగస్వాములు కానున్నారు. కియా మోటార్స్‌కు, రెన్యూ, మాండెలెజ్ ఇండియా, సెయింట్ గోబెయిన్, నాల్కో, లెవిస్టా వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు సదస్సులో భాగస్వాములు కానునున్నారు. ఇక సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా స్పేస్ రంగంలోని స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు నిలవనున్నారు. అంతరిక్ష సాంకేతికత, పరిశోధన, తయారీ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను విస్తరించే లక్ష్యంతో తేదీన ప్రముఖ భారతీయ ప్రైవేటు అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో సీఎం ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో హాథోర్ రాకెట్స్, అగ్నికుల్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, స్కైరూట్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. అలాగే జపాన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ స్ట్రాటజీ చైర్మన్‌తో సీఎం భేటీ అవుతారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలోనే మహిళా సాధికారతకు ప్రాధాన్యతిస్తూ ఓ సమావేశం నిర్వించనున్నారు. దీనికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు. 'విమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్-2026' పేరుతో విశాఖ నోవోటెల్‌లో ప్రారంభ కార్యక్రమం జరగనుంది. మహిళల ఆర్థిక సాధికారత, పారిశ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యం, వ్యాపారవేత్తలుగా మహిళలకు ప్రోత్సాహం వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో చర్చించనున్నారు.

కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి వరుస భేటీలు : సదస్సులో వివిధ శాఖలకు చెందిన కేంద్రమంత్రులతో సీఎం ఈ రెండు రోజుల్లో సమావేశం కానున్నారు. వివిధ రంగాల్లో పారిశ్రామికాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు రాష్ట్రానికి అందించాల్సిన చేయూతపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించనున్నారు. అలాగే రాష్ట్రంలోని వివిధ వర్గాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా కొన్ని వెసులుబాట్లు కల్పించే అంశాలను కేంద్రమంత్రుల వద్ద ప్రస్తావించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తలెత్తుతున్న పరిణామాలతో రాష్ట్రంలోని పలు రంగాలపై పడుతున్న ప్రభావాన్ని కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లనున్నారు. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి, సర్బానంద సోనోవాల్ వంటి వారితో సీఎం భేటీ కానున్నారు.

ఒకరోజు ముందే సీఎం సమావేశాలు : సమ్మిట్‌కు ఒకరోజు ముందుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో అమరావతి, విశాఖల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. బుధవారం సింగపూర్ మంత్రి గాన్ సియో హువాంగ్‌తో అమరావతిలో సమావేశమవుతారు. అనంతరం విశాఖ చేరుకుని వివిధ భేటీల్లో పాల్గొంటారు. డబ్ల్యూఐపీవో డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జపాన్ రాయబారి కీచి ఒనో, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ, రెన్యూ సంస్థ సీఈవో సుమంత్ సిన్హాలతో బుధవారమే సమావేశం కానున్నారు. బుధవారం సాయంత్రం సీఐఐ సీఈవోలతో సమావేశం, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటు చేసిన స్వాగత విందులో పాల్గొంటారు.

క్వాంటం కంప్యూటర్‌కు ప్రాధాన్యం



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో సాంకేతిక రంగ అభివృద్ధికి కీలక అడుగుగా ఫిబ్రవరి 3న క్వాంటం కంప్యూటర్‌ను ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఏఈఐలో రాష్ట్రం రెండో స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణపై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధిని పెంచేలా ప్రతి శాఖ పనిచేయాలని, 15 శాతానికి పైగా వృద్ధిరేటు సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.

త్వరలో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు మంత్రులందరూ హాజరుకావాలని చంద్రబాబు సూచించారు. ఈ సదస్సులో సుమారు రూ. 11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలు కుదరనున్నాయని, వీటి ద్వారా 11 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

రాష్ట్రానికి ఇప్పటివరకు మొత్తం రూ. 31 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. పెట్టుబడులను వాస్తవ ప్రాజెక్టులుగా మార్చి, పరిశ్రమల స్థాపనతో పాటు ఉద్యోగాల కల్పనకు అధికారులు, మంత్రులు సమన్వయంతో పనిచేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

స్థానిక సంస్థల్లో కీలక ఘట్టం

(మొదటి పేజీ తరువాయి)

అయితే తుపాను ప్రభావం కారణంగా తూర్పుగోదావరి జిల్లాలో ఒకటి, ఏలూరు జిల్లాలో నాలుగు మండలాల్లో మొత్తం ఐదు మండలాలకు సంబంధించి పోలింగ్‌ను ఈ నెల 06.11.2026కు వాయిదా వేసి నిర్వహించడం జరిగింది. అదేవిధంగా, ఈ నెల 05.11.2026న జరిగిన పోలింగ్‌లో కొన్ని ఎన్నికల అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఐదు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 06.11.2026న రీపోలింగ్ నిర్వహించారు.

రాష్ట్రంలోని అన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి ఈ నెల 07.11.2026న ఓట్ల లెక్కింపు చేపట్టి, ప్రక్రియ పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటించడం జరిగింది.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 659 మండల ప్రజా పరిషత్‌ల (ఎంపీపీలు)లో కో-ఆప్టెడ్ సభ్యులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికలకు, 28 జిల్లా ప్రజా పరిషత్‌ల (జెడ్పీపీలు)లో కో-ఆప్టెడ్ సభ్యులు, చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ రోజు (10.11.2026) నోటిఫికేషన్లు జారీ చేసింది.

దీని ప్రకారం ఎంపీపీలలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు ఈ నెల 19.11.2026న, జెడ్పీపీలలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు ఈ నెల 20.11.2026న సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు ప్రత్యేక సమావేశాలను నిర్వహించనున్నారు.

ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు తమలో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. అదేవిధంగా, ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు తమలో ఒకరిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, మరొకరిని వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటారు.

ప్రతి ఎంపీపీలో ఒక కో-ఆప్టెడ్ సభ్యుడిని, ప్రతి జెడ్పీపీలో ఇద్దరు కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు, జెడ్పీపీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల కంటే ముందుగా కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికను నిర్వహించాలి. ఈ సభ్యులు మతపరమైన మైనారిటీ లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందినవారై ఉండాలి.

11.03.1995 న జారీ చేసిన జీ.ఓ.ఎం.ఎస్. నెం.131, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సహాయ శాఖ (ఎన్నికలు-IV) ప్రకారం మతపరమైన మైనారిటీలలో ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జొరాస్ట్రియన్లు (పార్సీలు) ఉంటారు. తెలుగు మాతృభాష కాని ఇతర భాషలను మాతృభాషగా కలిగిన వారిని భాషాపరమైన మైనారిటీలుగా పరిగణిస్తారు.

ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు, జెడ్పీపీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు జరిగే ఎన్నికలను చేతులు పైకెత్తి ఓటు వేసే విధానంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సంబంధిత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ సభ్యులకు జారీ చేసే పార్టీ విప్‌ను తప్పనిసరిగా పాటించాలి. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలకు సంబంధించి పార్టీ విప్ జారీ చేసే నిబంధన లేదు.

సంబంధిత మండల, జిల్లా పరిషత్‌లకు ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న పార్లమెంట్ సభ్యులు (ఎంపీలు), శాసన మండలి సభ్యులు (ఎమ్మెల్సీలు), శాసనసభ సభ్యులు (ఎమ్మెల్యేలు) కూడా ఈ ప్రత్యేక సమావేశాలకు హాజరయ్యేందుకు ఆహ్వానించబడతారు.

అయితే ఈ ఎన్నికల్లో వారికి ఓటు వేసే హక్కు ఉండదు.

నిర్ణీత షెడ్యూల్ ప్రకారం, ఎంపీపీలకు ఈ నెల 19.11.2026 న, జెడ్పీపీలకు ఈ నెల 20.11.2026న నిర్వహించనున్న పరోక్ష ఎన్నికలకు సంబంధించి ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులను ఈ నెల 14.11.2026లోగా అందజేయనున్నారు.

పరోక్ష ఎన్నికల ప్రక్రియ సజావుగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం వివరణాత్మక విధివిధానాలు, మార్గదర్శకాలను కూడా జారీ చేసింది.

రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన రెండు నోటిఫికేషన్లు, విధివిధానాలకు సంబంధించిన సూచనల ప్రతులను సమాచార నిమిత్తం జతపరచడమైనది.

బీమాతో నిమిత్తం లేకుండా పరిహారం



అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్) : వరుస తుఫాన్లు, ఎర్రకాలువ వరదలతో తీవ్రంగా నష్టపోయిన తూర్పుగోదావరి జిల్లా, ముఖ్యంగా నిడదవోలు నియోజకవర్గ రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. అమరావతిలో మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

వరుసగా విరుచుకుపడిన 'మురసు', 'అర్నాబ్' తుఫాన్ల ప్రభావంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని మంత్రి వివరించారు. తుఫాన్ల ఉధృతికి ఎర్రకాలువ పొంగిపొర్లడంతో సమీప గ్రామాలు జలమయమయ్యాయని, చేతికొచ్చిన పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని తెలిపారు. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజల సాధారణ జీవనం స్తంభించిపోయిందని పేర్కొన్నారు.

పంటల బీమా సదుపాయం కొద్దిమంది రైతులకే ఉండటంతో మిగిలిన రైతులు పరిహారం అందక ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బీమాతో సంబంధం లేకుండా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతుకూ మానవీయ కోణంలో ప్రభుత్వ పరిహారం అందించాలని కోరారు.

తుఫాన్లు, ఎర్రకాలువ వరదల కారణంగా దెబ్బతిన్న పంటలు, ఇళ్ల నష్టంపై తక్షణమే సమగ్ర అంచనా చేపట్టాలని, నష్టపోయిన అర్హులైన రైతులందరినీ పరిహారం జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. నిడదవోలు నియోజకవర్గ రైతాంగానికి, వరద బాధిత ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచి తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని కోరారు.

మంత్రి విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు కందుల దుర్గేష్ తెలిపారు. బాధిత రైతులకు, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు.

తెనాలిలో నూతన కౌన్సిలర్ల విజయోత్సవ ర్యాలీ

పేరంటాలమ్మ ఆలయం నుంచి ప్రదర్శన.. పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్







తెనాలి, నవంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్) : ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి పార్టీ నూతన కౌన్సిలర్లు తెనాలిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఒకటి, రెండు, 49వ వార్డులకు చెందిన నూతన కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని పేరంటాలమ్మ ఆలయం సమీపం నుంచి ఈ ర్యాలీ ప్రారంభమైంది. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని నూతన కౌన్సిలర్లకు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు అందించిన విజయాన్ని బాధ్యతగా స్వీకరించాలని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలని సూచించారు. కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషి, ప్రజల ఆదరణ కూటమి అభ్యర్థుల విజయానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. ఈ విజయం పదవుల కోసం లభించినది కాదని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశంగా భావించాలని అన్నారు.

తెనాలి పట్టణ అభివృద్ధికి నూతన కౌన్సిలర్లు ప్రాధాన్యత ఇవ్వాలని ఆలపాటి సూచించారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ర్యాలీలో నూతన కౌన్సిలర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలుచోట్ల ప్రజలు ర్యాలీకి స్వాగతం పలికి నూతన ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఒకటో వార్డు కౌన్సిలర్ ప్రణీత్‌తో పాటు రెండో, 49వ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎన్నికల విజయంతో ఉత్సాహంగా ఉన్న కూటమి శ్రేణులు పట్టణ సమగ్ర అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు.





పెనుకొండలో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు



- ఫలించిన మంత్రి సవిత కృషి
- 2 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం
- ఐటీఐ ఏర్పాటుతో స్థానిక యువతకు ఎంతో మేలు
- కియా, అనుబంధ పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- సీఎం చంద్రబాబుకు, మంత్రిమండలికి మంత్రి సవిత ధన్యవాదాలు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా యువతకు మేలు కలిగేలా మంత్రి సవితమ్మ చేసిన కృషి ఫలించింది. పెనుకొండలో ఐటీఐ కళాశాల ఏర్పాటుకు రెండు ఎకరాలు కేటాయిస్తూ సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని మంత్రిమండలి సమావేశం నిర్ణయం తీసుకుంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం, రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా పెనుకొండ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 1245-1లో ఉన్న రెండు ఎకరాల భూమిని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు కేటాయించనున్నారు. ఐటీఐ కళాశాల ఏర్పాటుతో పదో తరగతి పూర్తి చేసుకున్న యువతకు వృత్తి, సాంకేతిక పరమైన విద్య అందించే అవకాశం కలుగుతుంది. దీనివల్ల కియా, దాని అనుబంధ పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ కళాశాల ఏర్పాటుతో పెనుకొండ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల విద్యార్థులకు సాంకేతిక విద్య, వృత్తి విద్య లో శిక్షణ పొందే అవకాశం లభించనుందని మంత్రి సవిత తెలిపారు.

స్థానికంగానే ఉద్యోగావకాశాలు : ఐటీఐ ఏర్పాటుతో వృత్తి, సాంకేతిక విద్య అభ్యసించే విద్యార్థులకు స్థానింగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలో కియా, దాని అనుబంధ పరిశ్రమలు విస్తృతంగా ఏర్పాటువుతున్నాయన్నారు. ఆయా పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన ఉద్యోగుల అవసరం ఉందన్నారు. ఐటీఐ శిక్షణ పొందిన విద్యార్థులకు ఆ పరిశ్రమల్లో సులభంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు ద్వారా వేలాది మంది విద్యార్థులకు ఎంతో మేలు కలుగునుందన్నారు. 2029 నాటికి 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఎన్నికల హామీకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. పెనుకొండలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు, ఇతర సహచర మంత్రివర్గ సభ్యులకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తాడిపత్రిలో మళ్లీ రాజుకున్న రాజకీయం

అనంతపురం(జర్నలిస్ట్ ఫైల్) : అనంతపురం జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. 2021లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలను, ప్రస్తుత తాజా ఫలితాలతో పోలుస్తూ ఆయన ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు స్థానికంగా పెను చర్చకు దారితీశాయి. ప్రత్యర్థి పార్టీ వైఖరిని ఎండగడుతూ జేసీ ప్రభాకర్ రెడ్డి ఈ ఫ్లెక్సీల ద్వారా నేరుగా ప్రశ్నల వర్షం కురిపించారు.

ఈ ఫ్లెక్సీలలో వైసీపీ నేతలను ఉద్దేశించి తీవ్రస్థాయిలో సెటైర్లు వేశారు. "2021లో మీకు కళ్లు దొబ్బాయా?" అంటూ ఘాటైన వ్యాఖ్యలను ఫ్లెక్సీలపై ప్రదర్శించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌లను లక్ష్యంగా చేసుకుంటూ.. "మీకు కళ్లు, చెవులు పనిచేస్తే ఈ ఫలితాలను చూడండి" అంటూ ఫ్లెక్సీల ద్వారా నిలదీశారు. గత ప్రభుత్వంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల తీరును, ఇప్పటి ఫలితాలను ప్రజల ముందు ఉంచేందుకే ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు. జగన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు ప్రతిష్ఠలను పూర్తిగా చెడగొట్టారని ఆయన మండిపడ్డారు. తాను జిల్లాలో ఫ్యాక్షన్ రాజకీయాలను శాశ్వతంగా రూపుమాపాలని గట్టిగా కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

పంట నష్టం నమోదు వేగవంతం

అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో ఇటీవల సంభవించిన ఆర్నాబ్, మురసు తుఫాన్ల కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాల నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో తుఫాన్ల వల్ల జరిగిన పంట నష్టాలు, ఎన్యూమరేషన్ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు.

ఆర్నాబ్ తుఫాను ప్రభావంతో 15 జిల్లాల్లో 10,90,933 హెక్టార్ల సాగు విస్తీర్ణానికి గాను 3,27,843 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మొత్తం 5,23,136 మంది రైతులు ప్రభావితమయ్యారని, 9,78,091 టన్నుల ఉత్పత్తి నష్టంతో రూ. 2,392.84 కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లినట్లు అంచనా వేసినట్లు తెలిపారు. కోనసీమ జిల్లాలో అత్యధికంగా 99.19 శాతం సాగు విస్తీర్ణం దెబ్బతినగా, 94,808 మంది రైతులకు సంబంధించి రూ. 348.88 కోట్ల నష్టం నమోదైందన్నారు. ఈ తుఫాను కారణంగా ఎస్డీఆర్ఎఫ్ కింద రూ. 815.57 కోట్లు, ఎన్డీఆర్ఎఫ్ కింద రూ. 714.96 కోట్ల నష్టాన్ని అంచనా వేసినట్లు వెల్లడించారు.

మురసు తుఫాను ప్రభావంతో తొమ్మిది జిల్లాల్లో 5,62,445 హెక్టార్ల సాగు విస్తీర్ణానికి గాను 1,33,351 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని



అధికారులు తెలిపారు. 1,86,269 మంది రైతులు ప్రభావితమయ్యారని, 3,38,302 టన్నుల ఉత్పత్తి నష్టంతో రూ. 816.53 కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లినట్లు అంచనా వేసినట్లు వివరించారు. ఎస్డీఆర్ఎఫ్ కింద రూ. 321.64 కోట్లు, ఎన్డీఆర్ఎఫ్ కింద రూ. 266.67 కోట్ల నష్టాన్ని అంచనా వేసినట్లు పేర్కొన్నారు.

ఉద్యాన పంటల నష్టాల వివరాలను కూడా అధికారులు మంత్రికి వివరించారు. ఆర్నాబ్ తుఫాను కారణంగా 15 జిల్లాల్లోని 215 మండలాలు, 1,310 గ్రామాల్లో 23,211.48 హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతినగా, 58,990 మంది రైతులు ప్రభావితమయ్యారు. ఇప్పటివరకు 58,630 మంది రైతులకు సంబంధించి 23,035.08 హెక్టార్లలో 99.24 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని తెలిపారు. మరో 360 మంది రైతులకు సంబంధించి 176.40 హెక్టార్లలో నమోదు ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. మొత్తం 15 జిల్లాల్లో 14 జిల్లాలు నూరు శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేయగా, కృష్ణా జిల్లాలో 86.67 శాతం పూర్తయిందని వివరించారు.

మురసు తుఫాను కారణంగా ఎనిమిది జిల్లాల్లోని 106 మండలాలు, 530 గ్రామాల్లో 6,748.52 హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, 12,586 మంది రైతులు ప్రభావితమయ్యారని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 3,392 మంది రైతులకు సంబంధించి 2,211.73 హెక్టార్లలో మాత్రమే, అంటే 32.77 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని పేర్కొన్నారు. ఇంకా 4,536.79 హెక్టార్లలో 9,194 మంది రైతులకు సంబంధించిన నమోదు ప్రక్రియ పెండింగ్‌లో ఉందని వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తుఫాన్ల వల్ల జరిగిన పంట నష్టాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. ఇంకా నమోదు కాని పంటల విస్తీర్ణం, రైతుల వివరాలను జిల్లాలవారీగా గుర్తించి ఎన్యూమరేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క రైతు కూడా నష్టపరిహారం జాబితాలో చోటు కోల్పోకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

పారిశ్రామిక ప్రగతికి బాటలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ విభాగం డీజీపీ పరిధిలో పనిచేయనుంది. ఐజీ స్థాయి అధికారి డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

టీటీడీలో కొత్త పోస్టులకు ఆమోదం : తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రధాన సన్నిధి యాదవ, అదనపు సన్నిధి యాదవ పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేవాదాయ శాఖ శిల్ప విభాగంలో చీఫ్ స్థపతి పోస్టును మంజూరు చేయడానికి కూడా అంగీకరించింది. వివిధ సంస్థలకు భూముల కేటాయింపులకు సంబంధించిన ప్రతిపాదనలపైనా కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది.



ఎస్సీ యువతకు ఉపాధే లక్ష్యం



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఎస్సి యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

మంగళవారం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఇజ్రాయిల్ నర్సింగ్ ట్రైనింగ్ వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా మంత్రి డా.స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పీఎం ఏజెఏవై కార్యక్రమంలో భాగంగా ఏపీ ఎస్సీ కార్పొరేషన్, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో ఏఎన్ఎం/జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఎస్సి మహిళలకు 3 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విశాఖ, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా తొలి విడతగా 1100 మందికి శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ అనంతరం ఇజ్రాయెల్ లో నెలకు రూ. 2 లక్షల వేతనంతో ఉపాధి కల్పించనున్నట్టు మంత్రి తెలిపారు. ఇప్పటికే జర్మన్ లాంగ్వేజ్లో 300 మందికి శిక్షణ ఇచ్చామని, వారికి జర్మనీలో ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎస్సి, ఎస్టీ నిరుద్యోగ యువతకు గ్రూప్స్ తో పాటు డీఎస్సీ, ఆర్ఆర్ బీ, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. డిఎస్సి ఉచిత శిక్షణతో 400 మంది ఉద్యోగాలు సాధించారని మంత్రి అన్నారు. ఎస్సి యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పమని, పేద ప్రజల తలసరి ఆదాయం పెరిగి రాష్ట్రంలో పేదరికం ఉండకూడదన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని అందుకనుగుణంగా సాంఘిక సంక్షేమ శాఖ పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఎస్సి విద్యార్థులు, నిరుద్యోగ యువతను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తూ అండగా ఉంటోందన్నారు. అర్హులైన వారు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాల్ని అందిపుచ్చుకుని జీవితంలో స్థిరపడాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పి. విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. ఎం. నాయక్, APSWREIS కార్యదర్శి తేజ్ భరత్, నేషనల్‌స్కిల్‌డెవలప్మెంట్‌కార్పొరేషన్‌ప్రతినిధులు, ఎస్సి కార్పొరేషన్ GM చెన్నయ్య, అన్ని జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు, నర్సింగ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

బాలల హక్కులే ప్రామాణికం

విజయవాడ, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ దరఖాస్తులు, అధికారిక రికార్డులు, ధ్రువీకరణ పత్రాల్లో చట్టపరంగా తప్పనిసరి కాని సందర్భాల్లో తండ్రి పేరు నమోదు చేయాలనే నిబంధనను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. తండ్రి వివరాలు లేవనే కారణంతో ఏ చిన్నారికీ విద్య, గుర్తింపు పత్రాలు, ఉపకార వేతనాలు, సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ సేవలు దూరం కాకూడని స్పష్టం చేసింది.

విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్‌లో మంగళవారం చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన 'తండ్రి పేరు తప్పనిసరి నిబంధన తొలగింపు' అంశంపై రాష్ట్రస్థాయి కార్యశాలలో కమిషన్ చైర్మన్ వెటుకూరి ఏ.వి.ఎస్.ఎస్.ఎన్. రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి చిన్నారికి స్వతంత్ర హక్కులు, గౌరవం, గుర్తింపు ఉంటాయని, తల్లిదండ్రుల వైవాహిక స్థితి, కుటుంబ పరిస్థితులు, సామాజిక నేపథ్యం ఆధారంగా పిల్లల భవిష్యత్తును నిర్ణయించకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వ పరిపాలనా విధానాల్లో పిల్లల గౌరవం, సమానత్వం, వ్యక్తిగత గుర్తింపు, ప్రాథమిక హక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల కన్వెన్షన్‌లోని ఆర్టికల్స్ 2, 3, 7, 8, 12, 16, 28లను ప్రస్తావిస్తూ వివక్షకు తావులేకుండా చూడటం, బాలల సంక్షేమం, గుర్తింపు, అభిప్రాయ వ్యక్తీకరణ, వ్యక్తిగత గోప్యత, విద్యా హక్కులను ఈ నిబంధనలు పరిరక్షిస్తున్నాయని వివరించారు.

ఒంటరి తల్లులు, అవివాహిత మహిళలు, వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, మానవ అక్రమ రవాణా, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ బాధితులు, చట్టబద్ధ సంరక్షకుల వద్ద పెరుగుతున్న పిల్లలు తండ్రి పేరు తప్పనిసరిగా నమోదు చేయాలనే నిబంధనతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రాలు, పాఠశాల ప్రవేశాలు, ఉపకార వేతనాలు, గుర్తింపు పత్రాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో అనవసరమైన అడ్డంకులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. కుటుంబ పరిస్థితులను పదేపదే వెల్లడించాల్సి



రావడం, అర్హత నిరూపించుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం బాధాకరమన్నారు.

చట్టపరంగా తప్పనిసరి కాని చోట తండ్రి పేరుకు బదులుగా తల్లి లేదా చట్టబద్ధ సంరక్షకుల వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కార్యశాలలో సూచించారు. ప్రభుత్వ దరఖాస్తు ఫారాలు, డేటాబేస్‌లు, ఆన్‌లైన్ పోర్టళ్లలో అవసరమైన మార్పులు చేపట్టాలని, జిల్లా, మండల, క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. తండ్రి పేరు నమోదు చేయలేదనే కారణంతో సేవలు నిరాకరించే సందర్భాల్లో ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ సంబంధిత ప్రభుత్వ శాఖలు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమన్వయంతో పనిచేసి, ఏ చిన్నారికీ విద్య, ఇతర అవకాశాలు దూరం కాకుండా సమగ్ర ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) జారీ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కుటుంబ పరిస్థితులతో సంబంధం లేకుండా మహిళలు, పిల్లలందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఒకే విధమైన బాలల హిత పరిపాలనా విధానాన్ని అమలు చేయాలని, ఆయా శాఖలు నిర్దిష్ట సిఫార్సులు రూపొందించి, నోడల్ అధికారులను నియమించి, నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

తండ్రి పేరు తప్పనిసరి నిబంధనను తొలగించడం అంటే తండ్రులను మినహాయించడం లేదా చట్టబద్ధమైన తల్లిదండ్రుల హక్కులు, బాధ్యతలను నిరాకరించడం కాదని కమిషన్ స్పష్టం చేసింది. వర్తించే చట్టాలకు అనుగుణంగా ప్రతి చిన్నారి గౌరవం, సమానత్వం, గుర్తింపు హక్కులను పరిరక్షించేందుకు చేపట్టే పరిపాలనా సంస్కరణగా దీనిని అభివర్ణించింది. తండ్రి పేరు లేదనే కారణంతో పిల్లల భవిష్యత్తుకు ఆటంకం కలగకుండా, వారి కుటుంబ పరిస్థితులపై పదేపదే ప్రశ్నించకుండా వ్యక్తిగత గోప్యతను కాపాడాలని పేర్కొంది.


చట్టపరంగా అనుమతించబడిన అన్ని సందర్భాల్లో బాలల హిత డాక్యుమెంటేషన్ విధానాలను అమలు చేసేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలకు వర్తించేలా సమగ్ర ప్రభుత్వ ఉత్తర్వు లేదా పరిపాలనా సర్క్యులర్ జారీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ఈ కార్యశాలలో కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.కె. విజయలక్ష్మి, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామారావు, జువైనల్ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ పి. రమణారెడ్డి, వసంతబాల, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శిరీష, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్. సుబ్బారావు, ఏలూరు బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ పి.వి. రావు, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హేమంత్ కుమార్, హెల్ప్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్. రామ్మోహన్, కమిషన్ సభ్యులు వి. గాంధీబాబు, చల్లా మధుసూదనరావు, పి. నాగమానస, ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ జెనిఫర్ వై, వివిధ జిల్లాల బాలల సంక్షేమ కమిటీల చైర్‌పర్సన్లు, కమిషన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఓబీసీ రిజర్వేషన్లలో సామాజిక న్యాయానికి సుప్రీం భరోసా!

తల్లిదండ్రుల వేతనం ఆధారంగా మాత్రమే క్రీమీలేయర్ నిర్ణయించలేరు..1993 నాటి మార్గదర్శకాల ప్రకారమే అర్హతల పరిశీలన.. మార్చి 11కు ముందు పూర్తయిన నియామకాలు, సీనియారిటీపై ప్రభావం ఉండదని స్పష్టీకరణ..పెండింగ్ కేసులకు వ్యక్తిగతంగా పరిశీలన.. కేంద్రానికి మరో రెండు నెలల గడువు



ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) రిజర్వేషన్లలో క్రీమీలేయర్ అర్హత నిర్ధారణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై నెలకొన్న సందేహాలకు తాజాగా కీలక స్పష్టత లభించింది. తల్లిదండ్రుల వేతన ఆదాయాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని ఓబీసీ అభ్యర్థిని క్రీమీలేయర్ పరిధిలోకి చేర్చడం సరైన విధానం కాదని గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు మరోసారి వివరించింది. అదే సమయంలో, ఈ తీర్పు కారణంగా ఇప్పటికే పూర్తయిన నియామకాలు, ఉద్యోగ కేటాయింపులు, సీనియారిటీ వ్యవస్థను తిరిగి తెరిచి మార్పులు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో గతంలో జరిగిన నియామకాలపై అనిశ్చితి తొలగడంతో పాటు, భవిష్యత్తులో చేపట్టే ఎంపికల విషయంలో అనుసరించాల్సిన విధానంపై స్పష్టత ఏర్పడింది.

ఓబీసీ క్రీమీలేయర్ వర్గీకరణలో తల్లిదండ్రుల ఉద్యోగ హోదా, ఆదాయం, ఆస్తులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన విధానంపై కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు సంబంధించి వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ వ్యవహారంలో లియానియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ రోహిత్ నాథన్ అండ్ అనదర్‌లి కేసులో 2026 మార్చి 11న సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. అనంతరం ఆ తీర్పు అమలుపై, ఇప్పటికే పూర్తయిన నియామకాలపై ప్రభావం ఎలా ఉంటుందనే అంశాలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన ధర్మాసనం నవంబర్ 6న మరింత స్పష్టత ఇచ్చింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇచ్చిన ఈ వివరణ ఉద్యోగ నియామకాలు, రిజర్వేషన్ల అమలులో ప్రాధాన్యం సంతరించుకుంది.

1993 మార్గదర్శకాలే ప్రాతిపదిక : ఓబీసీ క్రీమీలేయర్ వర్గీకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 1993 సెప్టెంబర్ 8న జారీ చేసిన కార్యాలయ మెమోరాండం (ఓఎం) కీలకమైనది. ఈ మార్గదర్శకాల్లో క్రీమీలేయర్ గుర్తింపునకు వివిధ ప్రమాణాలు, మినహాయింపులు, ఆదాయ పరిమితులు నిర్దేశించారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు), ప్రైవేటు రంగంలో పనిచేసే తల్లిదండ్రుల పిల్లల విషయంలో ఉద్యోగ హోదా సమానత్వం, ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకునే విధానం వంటి అంశాలు ఇందులో ప్రాధాన్యం కలిగి ఉన్నాయి.

అయితే 2004 అక్టోబర్ 14న కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీఓపీటీ) జారీ చేసిన వివరణాత్మక లేఖ ద్వారా ఈ అంశంపై మరింత స్పష్టత ఇవ్వడానికి ప్రయత్నించారు. ఈ లేఖలోని వివరణలు 1993 నాటి మార్గదర్శకాల పరిధిని మించుతున్నాయా? అసలు కార్యాలయ మెమోరాండంలో పేర్కొన్న నిబంధనలను తరువాతి శాఖాపరమైన లేఖ ద్వారా మార్చవచ్చా? అనే ప్రశ్నలు వివాదానికి దారితీశాయి. 2004లో ఇచ్చిన వివరణ 1993 నాటి ప్రధాన మార్గదర్శకాలను అధిగమించలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చట్టబద్ధమైన విధానాన్ని మార్చే అధికారం లేని వివరణాత్మక లేఖకు, అసలు మార్గదర్శకాలపై పైచేయి ఉండదని తీర్పు ద్వారా తేల్చింది.

వేతనం ఒక్కటే కొలమానం కాదు : ఈ తీర్పులో అత్యంత కీలకమైన అంశం తల్లిదండ్రుల వేతన ఆదాయాన్ని క్రీమీలేయర్ నిర్ణయానికి ఏకైక ప్రాతిపదికగా తీసుకోరాదన్నది. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల విషయంలో ఒకే విధమైన ప్రమాణాలు వర్తిస్తాయా? వారి ఉద్యోగ హోదాలను సమానంగా పరిగణించవచ్చా? అనే అంశాలను ముందుగా పరిశీలించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన హోదా, స్థాయి నిర్ధారణ కాని సందర్భాల్లో పీఎస్‌యూ లేదా ప్రైవేటు రంగ ఉద్యోగుల పిల్లల అర్హతను 1993 నాటి కార్యాలయ మెమోరాండంలో పేర్కొన్న ఆదాయ, ఆస్తుల పరీక్ష ఆధారంగా పరిశీలించాల్సి ఉంటుందని కోర్టు వివరించింది.

ఆ పరీక్షలో వేతన ఆదాయాన్ని ఎలా పరిగణించాలన్న విషయంలోనూ 1993 మార్గదర్శకాలనే అనుసరించాలి. కేవలం తల్లిదండ్రుల జీతం ఎక్కువగా ఉందనే కారణంతోనే అభ్యర్థిని క్రీమీలేయర్ పరిధిలోకి నెట్టడం సరికాదన్నది తీర్పు సారాంశం. అయితే ఈ అంశాన్ని అన్ని వర్గాల ఉద్యోగులకు ఒకే విధంగా వర్తింపజేసి, వేతనం ఎప్పుడూ పరిగణనలోకి రాదని అర్థం చేసుకోవడం కూడా సరికాదు. తల్లిదండ్రుల ఉద్యోగ వర్గం, హోదా, వర్తించే ప్రమాణాలు, 1993 మెమోరాండంలోని సంబంధిత నిబంధనలను సమగ్రంగా పరిశీలించిన తరువాతే నిర్ణయం తీసుకోవాలి. అంటే క్రీమీలేయర్ అర్హత నిర్ధారణ అనేది ఒక్క ఆదాయ సంఖ్య ఆధారంగా కాకుండా, వర్తించే నిబంధనల ప్రకారం జరగాలి.

పూర్తయిన నియామకాలకు రక్షణ: మార్చి 11న వెలువడిన తీర్పు తరువాత ఉద్యోగ నియామకాలు, ఎంపికలు, సీనియారిటీపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా గతంలో క్రీమీలేయర్‌గా పరిగణించి ఓబీసీ రిజర్వేషన్ ప్రయోజనం నిరాకరించిన అభ్యర్థులు, ఇప్పటికే నియామకాలు పొందిన ఉద్యోగుల పరిస్థితిపై సందేహాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో నవంబర్ 6న ఇచ్చిన వివరణాత్మక ఉత్తర్వులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మార్చి 11, 2026కు ముందే పూర్తయిన ఎంపికలు, నియామకాలు, ఉద్యోగ కేటాయింపులను ఈ తీర్పు ఆధారంగా తిరిగి తెరిచి మార్చాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పటికే ఖరారైన సీనియారిటీని కూడా ఈ తీర్పు కారణంగా మార్చాల్సిన అవసరం లేదని తెలిపింది. అంటే తీర్పు వెలువడిన తేదీకి ముందే పూర్తయిన నియామక ప్రక్రియలకు రక్షణ కల్పించినట్లయింది. దీనివల్ల ఇప్పటికే ఉద్యోగాల్లో చేరినవారిపై అనవసరమైన అనిశ్చితి తొలగుతుంది. పరిపాలనా వ్యవస్థలో స్థిరత్వం కొనసాగడానికి కూడా ఈ స్పష్టత తోడ్పడుతుంది.

అయితే ఈ రక్షణను గతంలో క్రీమీలేయర్‌గా పరిగణించిన ప్రతి ఒక్కరికీ ఆటోమేటిక్‌గా నాన్ క్రీమీలేయర్ హోదా లభించినట్లుగా భావించరాదు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, తదుపరి వివరణలో పేర్కొన్న అంశాలు సంబంధిత కేసుల పరిధి, నియామక ప్రక్రియ పూర్తయిన తేదీ, అభ్యర్థుల స్థితిగతుల ఆధారంగా వర్తిస్తాయి. కాబట్టి ప్రతి అభ్యర్థి తనకు వర్తించే నిబంధనలు, సంబంధిత ఉత్తర్వులను పరిశీలించుకోవాల్సి ఉంటుంది.


పెండింగ్ కేసులకు వ్యక్తిగత పరిశీలన : మార్చి 11కు ముందే పూర్తయిన నియామకాలకు రక్షణ కల్పించినప్పటికీ, అదే సమయంలో న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు లేదా సంబంధిత సమర్థ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న కేసులను పూర్తిగా పక్కన పెట్టలేదు. ఇలాంటి కేసుల్లో ఉన్న అభ్యర్థుల వాదనలను వారి వారి వాస్తవాలు, వర్తించే నిబంధనలు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా పరిశీలించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే ఆ అభ్యర్థులకు అనుకూలంగా తుది నిర్ణయం ఇవ్వాలా వద్దా అనే అంశంపై కోర్టు ముందుగానే అభిప్రాయం వ్యక్తం చేయలేదు. ప్రతి కేసును దాని స్వంత పరిస్థితుల ఆధారంగా నిర్ణయించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ అంశం ప్రాధాన్యం కలిగినది. ఎందుకంటే ఒకవైపు పూర్తయిన నియామకాలు, సీనియారిటీకి రక్షణ కల్పిస్తూనే, మరోవైపు న్యాయపరమైన పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తమ వాదనలను వినిపించే అవకాశం కొనసాగించింది. దీంతో పరిపాలనా స్థిరత్వం, వ్యక్తిగత న్యాయహక్కుల మధ్య సమతుల్యతను పాటించే ప్రయత్నం కనిపిస్తోంది.

సివిల్స్-2025 అభ్యర్థులకూ వర్తింపు : ఈ తీర్పు ప్రభావం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్ష-2025లో ఎంపికైన ఓబీసీ అభ్యర్థులపై కూడా పడింది. ఈ పరీక్ష ఫలితాలు 2026 మార్చి 6న ప్రకటించినప్పటికీ, మార్చి 11 నాటికి సేవల కేటాయింపు ప్రక్రియ పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో సివిల్స్-2025లో ఎంపికైన ఓబీసీ అభ్యర్థుల సేవల కేటాయింపులో మార్చి 11న ఇచ్చిన తీర్పులోని సూత్రాలను అనుసరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పటికే పూర్తయిన నియామకాలకు ఇచ్చిన రక్షణ, అప్పటికి ఇంకా పూర్తికాని సేవల కేటాయింపు ప్రక్రియకు వర్తించే విధానం వేర్వేరుగా ఉండవచ్చన్న విషయాన్ని ఈ ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి.

విధాన రూపకల్పన బాధ్యత కేంద్రానిదే : క్రీమీలేయర్ వర్గీకరణలో ప్రభుత్వ రంగ, ప్రైవేటు రంగ ఉద్యోగుల హోదాల సమానత్వాన్ని ఎలా నిర్ణయించాలి? సంబంధిత శాఖల మధ్య సంప్రదింపులు ఎలా జరగాలి? భవిష్యత్తులో ఏ విధమైన విధానాన్ని అనుసరించాలి? వంటి అంశాలపై తుది నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యాంగ సూత్రాలు, తీర్పులో ప్రతిపాదించిన న్యాయపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వం తగిన విధానాన్ని రూపొందించుకోవచ్చని తెలిపింది. అయితే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి నిర్దిష్ట గడువును విధించేందుకు కోర్టు నిరాకరించింది. ఇది కార్యనిర్వాహక, శాసన వ్యవస్థల పరిధిలోని అంశమని అభిప్రాయపడింది. కేంద్రం చేపట్టాల్సిన చర్యల కోసం గతంలో ఇచ్చిన గడువును నవంబర్ 6 ఉత్తర్వుల ద్వారా మరో రెండు నెలలు పొడిగించింది.

సామాజిక న్యాయం దిశగా స్పష్టమైన ప్రమాణాలు : ఓబీసీ రిజర్వేషన్ల ప్రధాన ఉద్దేశం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు సముచిత అవకాశాలు కల్పించడం. అదే సమయంలో ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన వర్గాలు రిజర్వేషన్ ప్రయోజనాలను నిరంతరం పొందకుండా క్రీమీలేయర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యత పాటించడం ప్రభుత్వ బాధ్యత. అర్హులైన అభ్యర్థులకు రిజర్వేషన్ ప్రయోజనాలు అందకుండా చేయడం ఎంత తప్పో, అర్హత లేని వారు ఆ ప్రయోజనాలను పొందకుండా చూడటం కూడా అంతే ముఖ్యం. క్రీమీలేయర్ నిర్ణయంలో స్పష్టత లేకపోతే ఉద్యోగ నియామకాలు, విద్యా ప్రవేశాలు, పోటీ పరీక్షల్లో అనవసరమైన వివాదాలు తలెత్తుతాయి. ఒకే తరహా పరిస్థితుల్లో ఉన్న అభ్యర్థులకు వేర్వేరు ప్రమాణాలు వర్తిస్తే సమానత్వ సూత్రం దెబ్బతింటుంది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం 1993 మార్గదర్శకాలను స్పష్టంగా అమలు చేయడంతో పాటు, ప్రభుత్వ రంగం, ప్రైవేటు రంగం, ప్రభుత్వ ఉద్యోగుల హోదాల సమానత్వంపై ఉన్న సందేహాలను తొలగించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా నియామక ప్రక్రియల్లో పారదర్శకత పాటించాలి.

మొత్తంగా, ఓబీసీ క్రీమీలేయర్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు కేవలం ఆదాయ పరిమితులపై జరిగిన న్యాయపరమైన వివాదానికి సంబంధించినది మాత్రమే కాదు. రిజర్వేషన్ అర్హతలను నిర్ణయించే విధానంలో చట్టబద్ధత, సమానత్వం, పరిపాలనా స్థిరత్వం ఎంత ముఖ్యమో గుర్తుచేసిన తీర్పు. తల్లిదండ్రుల వేతనాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించకుండా, వర్తించే నిబంధనలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలన్న సందేశాన్ని ఇది ఇచ్చింది. ఈ స్పష్టతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా అమలు చేసినప్పుడే అర్హులైన ఓబీసీ అభ్యర్థులకు న్యాయం జరిగి, రిజర్వేషన్ వ్యవస్థపై విశ్వాసం మరింత బలపడుతుంది.



ఓటరు కార్డు.. ఆధార్.. ప్రజల హక్కులకు ఏది రక్షణ?

- **గుర్తింపు పత్రాలపై గందరగోళం వద్దు.. సంక్షేమ పథకాల అమలులో స్పష్టతే ముఖ్యం!**

ప్రభుత్వ పాలనలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న కొద్దీ పౌరుల గుర్తింపు, సంక్షేమ పథకాల అమలు, పారదర్శకత వంటి అంశాలు కొత్త చర్చలకు దారితీస్తున్నాయి. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరాలంటే సమర్థవంతమైన గుర్తింపు వ్యవస్థ అవసరమే. అయితే ఆ వ్యవస్థ పేరుతో ప్రజలకు అందాల్సిన సంక్షేమాన్ని నిరాకరించే పరిస్థితులు ఏర్పడితే మాత్రం అది తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం. ఆధార్ కార్డుకు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును వినియోగించాలన్న కేంద్ర మంత్రి వ్యాఖ్యలు తాజాగా ఇలాంటి చర్చకే తెరతీశాయి. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెల్లింపుల విషయంలో ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డు నంబరును ఉపయోగించే విధానం గురించి ప్రస్తావించడం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చకు కారణమైంది. ఈ వ్యాఖ్యలతో ఆధార్ వ్యవస్థను పూర్తిగా పక్కనపెట్టి ఓటరు కార్డును ప్రత్యామ్నాయంగా తీసుకురాబోతున్నారా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అనంతరం మంత్రి వివరణ ఇస్తూ ఆధార్‌ను తొలగించే ఉద్దేశం లేదని, ఓటరు కార్డు వివరాలతోపాటు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణను కూడా వినియోగించనున్నట్లు స్పష్టం చేశారు.

అయితే ఈ వివరణతో అన్ని సందేహాలూ తొలగిపోయాయని చెప్పలేం. ఆధార్, ఓటరు గుర్తింపు కార్డుల మధ్య ఉన్న మౌలిక వ్యత్యాసాన్ని ముందుగా అర్థం చేసుకోవాలి. ఆధార్ ఒక వ్యక్తి గుర్తింపును నిర్ధారించే వ్యవస్థ. ఓటరు గుర్తింపు కార్డు ఎన్నికల సమయంలో ఓటరును గుర్తించడానికి ఉపయోగపడుతుంది. ఈ రెండింటి లక్ష్యాలు, చట్టపరమైన పరిధులు వేర్వేరు. ఒక వ్యక్తికి ఆధార్ ఉండటం మాత్రమే పౌరసత్వానికి ఆధారం కాదు. అదేవిధంగా ఓటరు గుర్తింపు కార్డు ఉండటం కూడా పౌరసత్వానికి అంతిమ ధ్రువీకరణ కాదు. ఇక్కడ ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశం ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ. ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడుతున్నాయనే ఆరోపణలు, అభ్యంతరాలు ఇప్పటికే చర్చలో ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఓటరు కార్డు లేదా ఓటరు జాబితాలోని వివరాలను సంక్షేమ పథకాలతో అనుసంధానిస్తే కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఓటరు జాబితాలో పేరు లేకపోయినా ఒక వ్యక్తి ఇతర అర్హతలను కలిగి ఉండవచ్చు. కేవలం ఎన్నికల జాబితాలో పేరు లేదన్న కారణంతో అతడికి ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలను నిరాకరించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. భారతదేశంలో సంక్షేమ పథకాలు కోట్లాది మంది పేదలకు జీవనాధారంగా ఉన్నాయి. వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్లు, దివ్యాంగుల పింఛన్లు, రేషన్ సరుకులు, ఉపాధి హామీ, విద్యా సహాయం వంటి పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయి. వీటిని పొందే వారిలో చాలామందికి డిజిటల్ పరిజ్ఞానం తక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయకపోవడం, వేలిముద్రలు సరిపోకపోవడం, సాంకేతిక అంతరాయాలు వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మరిన్ని గుర్తింపు నిబంధనలు విధిస్తే లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పవు.

అక్రమాలను అరికట్టడం, నకిలీ లబ్ధిదారులను గుర్తించడం ప్రభుత్వానికి అవసరమే. కానీ ఆ ప్రక్రియలో నిజమైన లబ్ధిదారులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ ధ్రువీకరణ విధానాలను అందుబాటులో ఉంచాలి. ఆధార్ లేదా ఓటరు కార్డు అందుబాటులో లేని వారికి ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాల ద్వారా అర్హత నిరూపించుకునే అవకాశం కల్పించాలి. బయోమెట్రిక్ ధ్రువీకరణ విఫలమైనంత మాత్రాన ప్రయోజనాలను నిలిపివేయకూడదు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం. సంక్షేమ ప్రయోజనాలు అర్హత ఆధారంగా అందించాల్సిన ప్రభుత్వ బాధ్యత. ఈ రెండింటినీ పరస్పరం ముడిపెట్టడం ప్రజల్లో అనవసర ఆందోళనలకు దారితీస్తుంది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి. గుర్తింపు పత్రాల వినియోగం, ధ్రువీకరణ విధానం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, లబ్ధిదారుల హక్కుల పరిరక్షణపై సమగ్ర మార్గదర్శకాలు విడుదల చేయాలి.

పాలనలో సాంకేతికత ప్రజలకు సేవ చేయాలి. ప్రజలను సాంకేతిక నిబంధనల చుట్టూ తిప్పకూడదు. గుర్తింపు కార్డులు ప్రభుత్వానికి అవసరమైన పరిపాలనా సాధనాలు మాత్రమే. కానీ సంక్షేమ పథకాల అసలు లక్ష్యం ప్రజల జీవన భద్రత. ఆ లక్ష్యం దెబ్బతినకుండా చూడటమే ప్రభుత్వ బాధ్యత. ప్రజల హక్కుల కంటే గుర్తింపు పత్రాలకు ప్రాధాన్యం పెరిగే పరిస్థితి రాకూడదు.



మౌలానా అబుల్ కలాం ఆజాద్ (రహ్మతుల్లాహి అలైహి)

వ్యక్తిత్వం, విద్యా-సాహిత్య సేవలు మరియు ఉర్దూ భాషా సాహిత్య అభివృద్ధిలో వారి మహోన్నత పాత్ర

భారత ఉపఖండ చరిత్రలో కొందరు మహనీయుల వ్యక్తిత్వం, వారి అపారమైన జ్ఞానం, సాహిత్య ప్రతిభ, లోతైన ఆలోచనా విధానం, జాతీయ సేవలు, విద్యారంగంలో చేసిన కృషి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి. మౌలానా అబుల్ కలాం ఆజాద్ (రహ్మతుల్లాహి అలైహి) అలాంటి బహుముఖ ప్రజ్ఞాశాలి మరియు మహోన్నత వ్యక్తులలో ఒకరు. వారు గొప్ప ఇస్లామిక్ పండితులు, ఉన్నత స్థాయి సాహితీవేత్త, అసాధారణ వక్త, ప్రముఖ పాత్రికేయులు, విశిష్ట రచయిత, తత్వవేత్త, ఖుర్‌ఆన్ వ్యాఖ్యాత, స్వాతంత్ర్య సమరయోధులు మరియు స్వతంత్ర భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రిగా విశేష ఖ్యాతిని పొందారు.వారు తమ జీవితమంతటినీ విద్యాభివృద్ధి, జాతీయ చైతన్యం, దేశ స్వాతంత్ర్యం, హిందూ-ముస్లిం ఐక్యత మరియు విద్యారంగ ప్రగతి కోసం అంకితం చేశారు.



మౌలానా అబుల్ కలాం ఆజాద్ 11 నవంబర్ 1888న పవిత్ర మక్కా నగరంలో జన్మించారు. వారి అసలు పేరు మొహియుద్దీన్ అహ్మద్. వారి తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ప్రముఖ ఇస్లామిక్ పండితులు. వారి కుటుంబం విద్యా, మతపరమైన గొప్ప సంప్రదాయాలకు నిలయంగా ఉండేది.

మౌలానా ఆజాద్ ప్రాథమిక విద్యాభ్యాసం, శిక్షణ ఇంటివద్దనే జరిగింది. అరబీ, పర్షియన్, ఉర్దూ, మతపరమైన విద్య, తత్వశాస్త్రం, తర్కశాస్త్రం తదితర విషయాలలో అసాధారణ ప్రతిభను కనబరిచారు. చదువుపై ఆసక్తి, అపారమైన మేధాశక్తి, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యం కారణంగా చిన్న వయస్సులోనే ప్రముఖ పండితుడిగా గుర్తింపు పొందారు.

మౌలానా ఆజాద్ సాహిత్య, పాత్రికేయ సేవల్లో అత్యంత ప్రముఖమైనవి వారు ప్రారంభించిన పత్రికలు. 1912లో కలకత్తా నుంచి అల్-హిలాల్ అనే వారపత్రికను ప్రారంభించారు.

ఆ తరువాత అల్-బలాగ్ పేరుతో మరో పత్రికను కూడా ప్రచురించారు. ఈ రెండు పత్రికలు ఉర్దూ పాత్రికేయ రంగానికి ఆలోచనా ఉన్నతిని, సాహిత్య సౌందర్యాన్ని, జాతీయ చైతన్యాన్ని మరియు సామాజిక ప్రయోజనాన్ని అందించాయి.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ సాహిత్యం, మతపరమైన విజ్ఞానం, చరిత్ర, తత్వశాస్త్రం మరియు రాజకీయ ఆలోచనా రంగాలలో ఎన్నో విలువైన రచనలను అందించారు.వారి ప్రముఖ రచనలు:

1. తర్జుమానుల్ ఖుర్‌ఆన్ :పవిత్ర ఖుర్‌ఆన్‌కు సంబంధించిన విశిష్ట వ్యాఖ్యాన గ్రంథం.
2. ఘుబార్-ఎ-ఖాతిర్ :వారి లోతైన ఆలోచనలు, తాత్విక భావనలు, సాహిత్య ప్రతిభను ప్రతిబింబించే ప్రసిద్ధ రచన.
3. తజ్కిరా : వారి జీవిత అనుభవాలు, కుటుంబ నేపథ్యం మరియు మేధోపరమైన పరిణామాలను తెలియజేసే రచన.
4. ఇండియా విన్స్ ఫ్రీడమ్ : భారత స్వాతంత్ర్య ఉద్యమం మరియు రాజకీయ పరిణామాలను వివరించే ముఖ్యమైన గ్రంథం.

మౌలానా ఆజాద్ హిందూ-ముస్లిం ఐక్యతకు బలమైన మద్దతుదారులు. భారతదేశ సంస్కృతి అనేక మతాలు, భాషలు మరియు సంప్రదాయాల సమ్మేళనంతో ఏర్పడిందని వారు విశ్వసించారు.

మత సామరస్యం, జాతీయ సమైక్యత, పరస్పర గౌరవం మరియు ఉమ్మడి భారతీయ సంస్కృతికి వారు ప్రతీకగా నిలిచారు.

స్వతంత్ర భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రి.

15 ఆగస్టు 1947న భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వతంత్ర భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రిగా నియమితులయ్యారు. 1947 నుంచి 1958 వరకు ఈ కీలక పదవిలో కొనసాగుతూ దేశ విద్యావ్యవస్థ పునాదులను బలోపేతం చేయడంలో చారిత్రాత్మక పాత్ర పోషించారు.

వారి విద్యారంగ సేవల్లో ముఖ్యమైన అంశాలు:

దేశంలో ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు.

ఉన్నత విద్య మరియు శాస్త్రీయ పరిశోధనా సంస్థల అభివృద్ధికి ప్రోత్సాహం అందించారు.

సాంకేతిక మరియు వృత్తివిద్యను జాతీయ అభివృద్ధికి అత్యవసరమైనవిగా గుర్తించారు.

విశ్వవిద్యాలయాల విద్యా ప్రమాణాలు మరియు స్వయంప్రతిపత్తికి మద్దతునిచ్చారు.

మహిళా విద్య మరియు విద్యావకాశాల్లో సమానత్వానికి ప్రాధాన్యతనిచ్చారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన అపారమైన విద్యా సేవలకు గుర్తింపుగా భారతదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవం జరుపుకుంటారు.లిలిఈ రోజు వారి జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు మరియు ఇతర విద్యాసంస్థల్లో వివిధ విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ (రహ్మతుల్లాహి అలైహి) సేవలు భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. వారి జీవితం, ఆలోచనలు, ఆశయాలు మరియు విద్యా సందేశం భావితరాలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయి.



రచన: షేక్ నాగూర్ వలి
స్పెషల్ ఆఫీసర్ (ఉర్దూ), బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్.

మల్కాజిగిరి భూ సమస్యలకు మోక్షమెప్పుడో

- ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి
- అర్హులైన పేదలకు పట్టాలు ఇవ్వాలి.. ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలి



హైదరాబాద్, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి భూపరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ శాఖ ప్రభుత్వ కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నేరేడ్‌మెట్‌లోని సర్వే నంబరు 278 పరిధిలో సుమారు 22 కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. జీవో నంబరు 166 ప్రకారం 80 గజాల వరకు ఉచిత క్రమబద్ధీకరణ హామీని అమలు చేయాలని, జీవో నంబర్లు 58, 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించి అర్హులకు పట్టాలు అందించాలని కోరారు. మల్లాపూర్‌లో పొరపాటున నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తొలగించేందుకు అవసరమైన గెజిట్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మహేంద్ర హిల్స్‌లోని సర్వే నంబరు 844/1 పరిధిలో జిల్లా, మండల సరిహద్దులను భూముల సర్వే ద్వారా నిర్ధారించాలని, సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కోరారు. న్యాయ స్థానాల్లో కేసుల కారణంగా నిలిచిపోయిన జలాశయ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే మల్కాజిగిరి ప్రాంతంలో రహదారుల విస్తరణ, నూతన రహదారుల నిర్మాణానికి అవసరమైన భూమిని సమాన విలువ గల భూముల మార్పిడి విధానం ద్వారా సమకూర్చాలని కోరారు. అల్వాల్‌లోని సర్వే నంబర్లు 582, 583 పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి రక్షించాలని, అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మల్లికార్జున నగర్‌లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న పట్టణ భూ పరిమితి చట్టానికి సంబంధించిన సమస్యను పరిష్కరించి స్థానిక నివాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు అనేక సంవత్సరాలుగా భూ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, అర్హులైన వారికి న్యాయం జరగాలంటే అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే వినతులపై భూపరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, బైరు అనిల్, కాలనీల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బి.టి. శ్రీనివాస్, కాలనీవాసులు అచ్యుతరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఆందోళనతో గ్రామాల్లో ఆరోగ్య సంక్షోభం!

- 34 రోజులుగా కొనసాగుతున్న ఉద్యోగుల దీక్ష.
- ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చరా?. గ్రామీణ వైద్యాన్ని గాలికొదిలేస్తారా.?



వికారాబాద్, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్షలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. ఉద్యోగులు చేపట్టిన దీక్ష సోమవారం నాటికి 34వ రోజుకు చేరుకుంది. ఇన్ని రోజులుగా ఆందోళన కొనసాగుతున్నప్పటికీ సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని ఉద్యోగులు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కరోనా సమయంలో సైతం ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వహించామని తెలిపారు ఎన్నో ఏళ్లుగా వైద్య ఆరోగ్యశాఖలో కీలక సేవలు అందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

గ్రామీణ వైద్య సేవలపై సమ్మె ప్రభావం

ఉద్యోగుల ఆందోళన ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు వారి నిరసన ప్రభావం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలపై పడుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బస్తీ దవాఖానాలు, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందక సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ అనారోగ్య సమస్యలకు సైతం సమీపంలోని వైద్య కేంద్రాలను ఆశ్రయించే పేద ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోతే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.మహిళలు, వృద్ధులు, వికలాంగులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు వైద్యం కోసం మండల, నియోజకవర్గ కేంద్రాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోనే అందుబాటులో ఉండాల్సిన వైద్య సేవలకు అంతరాయం కలగడం పేద ప్రజలకు భారంగా మారుతోందని గ్రామాలలో అనారోగ్యంతో ఉన్న ప్రజలు వాపోతున్నారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అదే సమయంలో సామాన్య ప్రజలకు అత్యవసరమైన వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదేనని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.34 రోజులుగా ఉద్యోగులు దీక్ష చేస్తున్నా ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు నిరంతరం కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డీఎంహెచ్ఓ కార్యాలయం వివరణ

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవల్లో ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక వైద్య సిబ్బందిని నియమించినట్లు వికారాబాద్ డీఎంహెచ్ఓ కార్యాలయం వెల్లడించింది. ముఖ్యంగా చిన్నారులకు వ్యాక్సినేషన్‌తో పాటు అవసరమైన వైద్య సేవలు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టినట్లు కార్యాలయ సిబ్బంది వివరించారు.

మెగా రైతు మేళాకు కడ్తాల్ మండల రైతులు

- నాలుగు ప్రత్యేక బస్సుల్లో హకీంపేటకు బయలుదేరిన మహిళా రైతులు,రైతులు
- కలెక్టర్,జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు సంయుక్త ఏర్పాట్లు



కడ్తాల్, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట గ్రామంలో నిర్వహిస్తున్న మెగా రైతు మేళా కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం నుంచి మహిళా రైతులు,రైతులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.గౌరవ ముఖ్యమంత్రి పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్,జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.డీఆర్డీఏ ఏపీఎం రాములు,వ్యవసాయ శాఖ అధికారి కవిత,ఎంపీడీవో సుజాత నాయక్ సంయుక్త ఆధ్వర్యంలో కడ్తాల్ మండలం నుంచి మొత్తం నాలుగు బస్సులను ఏర్పాటు చేసి మహిళా రైతులు,రైతులను మెగా రైతు మేళాకు తరలించారు.ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు నిర్వహించారు.మెగా రైతు మేళాలో వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు,నూతన సాంకేతిక పరిజ్ఞానం,రైతుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై అవగాహన పొందేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు తెలిపారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మేళాల ద్వారా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు,నూతన సాగు విధానాలు,రైతులకు అందుబాటులో ఉన్న పథకాలపై అవగాహన పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు.కడ్తాల్ మండలం నుంచి మహిళా రైతులు,రైతులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషంగా నిలిచింది.

దేవుని పడకల్‌లో ఉపాధి హామీ పనులకు శ్రీకారం

- మహమ్మద్ ఖాన్ చెరువులో పనులు ప్రారంభించిన సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్



తలకొండపల్లి, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న వి.బి.జి.రామ్‌జీ పథకంలో భాగంగా రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం దేవునిపడకల్ గ్రామపంచాయతీ పరిధిలోని మహమ్మద్ ఖాన్ చెరువులో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు.గ్రామ సర్పంచ్ శ్రీమతి కానుగుల అనిత మల్లేష్ కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనిత మల్లేష్ మాట్లాడుతూ..ఉపాధి హామీ పనుల్లో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 125 రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.గ్రామంలోని అర్హులైన కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. గ్రామ ప్రజలకు స్థానికంగానే ఉపాధి లభించేలా ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు ఆర్థిక భరోసా కలగడంతో పాటు చెరువులు,గ్రామీణ వనరుల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని,పనుల్లో కూలీలు ఉత్సాహంగా పాల్గొని ప్రభుత్వ లక్ష్యాల సాధనకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంబటి వెంకటేష్,వార్డు సభ్యులు రావిచెడు స్వామి గౌడ్,కాడ మౌని రాము,అంబటి లక్ష్మయ్య,కానుగుల మాధవి మల్లేష్,రాజమౌని జ్యోతి లక్ష్మయ్య,మద్దూరి మాధవి మహేష్,రాజమౌని మంజుల శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి నరేష్,మేట్ శ్రీను,ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు

- ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

సంబంధిత అధికారులకు మల్కాజిగిరి జోనల్ కమిషనర్ ఆదేశాలు



మల్కాజిగిరి, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వారికి సత్వర ఉపశమనం కల్పించాలని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్ల నుంచి మొత్తం ఐదు ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో కీసర సర్కిల్ నుంచి నాలుగు, మల్కాజిగిరి సర్కిల్ నుంచి ఒక ఫిర్యాదు అందగా, అల్వాల్, బోయిన్‌పల్లి, మౌలాలి సర్కిళ్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను జోనల్ కమిషనర్ సమీక్షించి, ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు వీలైనంత త్వరగా తగిన ఉపశమనం కల్పించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ జాకియా సుల్తానా, ఉప సంచాలకులు బి. శ్రీధర్ రావు, సహాయ నగర ప్రణాళికాధికారి వి.వి. శ్రీనివాస్ రావు, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు పద్మలత, ఈ. లౌక్య, విద్యుత్ విభాగం సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ జి. కవిత, పారిశుద్ధ్య విభాగం అధికారి టి. ప్రశాంతి, పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ జి. రామారావు, సహాయ వైద్యాధికారులు అజయ్, డి. శాంతిప్రియ తదితర అధికారులు పాల్గొన్నారు.

అరే కటిక రాష్ట్ర అధ్యక్షుడికి ఘన సన్మానం.....

మామిడిపల్లి బీజేపీ నాయకుడు పేరమోని నరేష్ యాదవ్



జల్‌పల్లి , నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర అరే కటిక అభివృద్ధి సంఘం గౌరవ అధ్యక్షులుగా మామిడిపల్లి గ్రామ వాస్తవ్యుడు కె. నందిశ్వర్ ఎన్నికైన సందర్భంగా సోమవారం మామిడిపల్లి బీజేపీ పార్టీ తరపున ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడికి బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భముగా మామిడిపల్లి బీజేపీ నాయకుడు పేరమోని నరేష్ యాదవ్ మాట్లాడుతూ అరే కటిక కులస్తుల పట్ల మీకున్న నిబద్ధత, నిస్వార్థ సేవ మరియు తోటివారిని కలుపుకుపోయే మీ విశాల హృదయమే మిమ్మల్ని ఈ అత్యున్నత స్థానంలో నిలబెట్టిందని, సంఘం అభివృద్ధికి, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి మీరు మరింత కృషి చేస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాము అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎండీ నయీమ్, గుర్జాని గణేష్ తదితరులు పాల్గొని రాష్ట్ర గౌరవ అధ్యక్షులుకి తమ అభినందనలు తెలియజేశారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మైనంపల్లి హనుమంతరావు



మల్కాజిగిరి, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయినగర్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మైనంపల్లి హనుమంతరావు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రామన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, మురుగేష్, మీనా ఉపేందర్ రెడ్డి, నియోజకవర్గ బాధ్యుడు లక్ష్మీకాంత్ రెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, పిట్ల శ్రీనివాస్, ఎస్.ఈర్. ప్రసాద్, శ్రీరామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాస్‌పల్లిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు



కడ్తాల్, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించడంతో పాటు నీటి సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్నాస్‌పల్లి గ్రామపంచాయతీ పాలక వర్గం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామంలోని సబ్‌స్టేషన్ వద్ద ఉన్న గ్రామపంచాయతీ బోరు నుంచి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్) వరకు మంచినీటి సరఫరా పైపులైన్ పనులను గ్రామ సర్పంచ్ నేనావత్ శ్రీను ప్రారంభించారు.గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.పైపులైన్ పనులు పూర్తయితే నీటి సరఫరా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కంబాల ప్రశాంత్,రావుల జగన్ గౌడ్,రావుల పద్మ రాజు గౌడ్ మోతీలాల్,రామావత్ రేణుక,శివ,గ్రామ కార్యదర్శి ధనంజయ,రావుల కుమార్ గౌడ్,లక్ష్మయ్య, రాములు,నరసింహ, రాందాస్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు 5.30 లక్షలు మంజూరు

- రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు..

బోరు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- వినాయక్ నగర్‌లో పర్యటించిన మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి



మల్కాజిగిరి, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి తెలిపారు. వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని ఏడో లేన్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ పనుల కోసం కార్పొరేటర్ నిధుల నుంచి కేటాయించిన 2 కోట్లలో భాగంగా 5 లక్షల 30 వేల నిధులు వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. డ్రైనేజీ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని కాంట్రాక్టర్ రాములుకు సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాలని ఆమె దృష్టికి తీసుకురాగా, వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయించి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బస్తీవాసులు బోరులో నీరు సక్రమంగా రావడం లేదని ఫిర్యాదు చేయడంతో వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడారు. దీనిపై స్పందించిన జలమండలి ఉప ప్రధాన నిర్వాహకుడు మరుసటి రోజు బోరు మరమ్మతుల నిపుణుడిని పంపించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా క్యానం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని, స్థానికుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఓం ప్రకాష్, బస్తీవాసులు చందు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ స్టేడియం యోగా ప్రాంగణంలో సౌకర్యాలు కల్పించాలి

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్‌కు యోగాభ్యాసకుల వినతి



శేర్లింగంపల్లి, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : పీజేఆర్ స్టేడియంలోని యోగా ప్రాంగణంలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ యోగాభ్యాసకులు సోమవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రాలు అందజేశారు.

గత 12 ఏళ్లుగా పతంజలి యోగా విధానంలో ప్రతిరోజూ ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్నప్పటికీ తగిన సౌకర్యాలు లేవని యోగా శిక్షకులు పుట్ట వినయ్ కుమార్ గౌడ్, జగన్నాథం వివరించారు. వర్షాకాలం, చలికాలంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.యోగా ప్రాంగణానికి పైకప్పు, పాముల నుంచి రక్షణ కోసం మూడు అడుగుల ప్రహరీ, పరికరాల భద్రతకు రెండు గదులు, గాలి, వెలుతురు ప్రసరించేలా చుట్టూ జాలి ఏర్పాటు చేయాలని కోరారు. యోగా మ్యాట్లు, ధ్వని వ్యవస్థ వంటి సౌకర్యాలు కూడా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గాంధీ ఈ నెల 11న జోనల్ కమిషనర్, సంబంధిత అధికారులతో కలిసి స్టేడియాన్ని సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యోగాభ్యాసకులు ఎమ్మెల్యేను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రెడ్డి రఘునాథ్ రెడ్డి, పలువురు యోగాభ్యాసకులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో భయభ్రాంతులకు గురవుతున్న

పసుమాముల, పెద్ద అంబర్‌పేట్ ప్రజలు



పెద్ద అంబర్‌పేట్, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) : పెద్ద అంబర్‌పేట్ డివిజన్ లోని పసుమాముల గ్రామంలో గత వారం రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి దీపావళి రోజు రాత్రి ఒంటరి మహిళ ఇంట్లో సిలిండర్, ప్రక్కన ఇంట్లో ఒక బైక్ ,అలాగే పెద్ద అంబర్‌పేటలో A1 వద్ద ఒక బైక్ గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు, మూడు రోజుల ముందు పసుమాముల గ్రామపంచాయతీ బోరు వైర్లు, ఒక లారీలోని డీజిల్ ,మరొక బైక్ పెట్రోల్, రాముల వారి గుడిలో కొన్ని పనిముట్లు చోరీ గురి అయినాయి కాలనీ లో నిత్యం రాత్రి పోలీస్ పర్యవేక్షణ ఉండాలని ఎరగాని మహేష్ , గ్రామ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు , అనుమాన వ్యక్తుల పట్ల ప్రమతంగా ఉండాలని కాలనీలలో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఎవరైనా ఇంటి యజమానులు కొత్త వ్యక్తులకు కిరాయికి ఇచ్చేవాళ్ళు వారి వివరాలను సేకరించి కాలనీల బాధ్యులకు అందించాలని పోలీసులు తెలిపారు.

ఖమ్మంలో సోమవతి అమావాస్య సందర్భంగా వివిధ గోశాలలకు గోదాణా వితరణ

ఖమ్మం, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) :



శ్రీ పరాభవ నామ సంవత్సర ఆశ్వయుజ బహుళ అమావాస్య, దీపావళి పర్వదినంతో కూడిన సోమవతి అమావాస్యను పురస్కరించుకొని శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యంలో నగరంలోని వివిధ గోశాలలకు సోమవారం గోదాణా వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.నగర పెద్దలు, గోప్రేమికులు, రుక్మిణి సిల్క్స్ యాజమాన్యం, స్థానిక దాల్ మిల్ యజమానులు, ఛాంబర్ లోని వివిధ వ్యాపార వర్గాల వారు, మిత్రులు, సేవా సమితి సభ్యులు, తదితర గోభక్తుల ద్వారా సేకరించిన సుమారు రూ. 74,000 విరాళాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గొల్లగూడెంలోని ఓం శ్రీకృష్ణ గోశాల, టేకులపల్లిలోని శ్రీ వెంకటేశ్వర గోశాల, 3 టౌన్ ప్రాంతంలోని శ్రీ వాసవి దేవాలయం, శ్రీ లక్ష్మీ రంగనాథస్వామి గోశాల, శ్రీ గుంటిమల్లేశ్వరస్వామి గోశాల, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి గోశాల, కాలవొడ్డు శ్రీ ఆంజనేయస్వామి గోశాల మరియు శ్రీ శృంగేరి శారదా పీఠం గోశాలలకు పచ్చిగడ్డి, బెల్లం బాక్సులు, మినప, పెసర, కంది, బొబ్బర చున్నీ, వరిపేలాలు, కూరగాయలు తదితర గోదాణాను ఆయా గోశాలల బాధ్యులకు దాతల పక్షాన అందజేశారు.ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీ నరసింహారావు, సభ్యులు సూరినేటి మల్లేశం, పల్లా లింగయ్య, గజ్జి సూర్యనారాయణ, కందిబండ రమేష్, రైల్వే మధ్య గేట్ శ్రీ హనుమాన్ దేవాలయ ఛైర్మన్ ఖాజా మురళీ కృష్ణ, దాతలు మిట్టపల్లి ప్రభాకర్ రావు, వంగవీటి నవీన్, చల్లా రమేష్, కటకం ఉదయభాస్కర్, మైలవరపు భద్రయ్య దంపతులు, కారంశెట్టి నాగేశ్వరరావు, దేవిశెట్టి అశోక్ కుమార్ దంపతులు, సుంకర యెల్లారావు, ఇద్దెగాని నాగేశ్వరరావు, వి.వి. సుబ్బారావు తదితరులతో పాటు గోభక్తులు, మహిళా భక్తులు, ఆయా గోశాలల బాధ్యులు ఓం నారాయణ, కేసా హనుమంతరావు, ఆరుట్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు. శ్రీ స్తంభాద్రి సేవాసమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనర సింహారావు మాట్లాడుతూ సోమవతి అమావాస్య చాలా విశిష్టమైన ప్రాధాన్యంతో కూడిన రోజు అని ఈ అమావాస్యకు గోమాతలకు వివిధ రకాల దానాలు సమర్పించటం వల్ల ముక్కోటి దేవతల ఆశీస్సులు లభిస్తాయని పితృదేవతలు సంతృప్తి చెందుతారని గోమాతలకు ఆహారం అందిస్తే పితృదేవతలకు స్వయంగా ఆహారం అందించిన ఫలితం దక్కుతుందని తెలియజేశారు స్తంభాద్రి సేవ సమితి ద్వారా అనేక విశిష్టమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు గోవులకు ఆహారం అందించడం నిరంతరం జరుగుతుందని ఆయన తెలియజేశారు.ఈ సందర్భంగా గోదాణాకు సహకరించిన పెద్దలకు, దాతలకు, గోభక్తులకు ఆయా గోశాలల వారు వేద ఆశీర్వచనాలు తెలియజేస్తూ, శ్రీస్వామివారి మరియు ముక్కోటి దేవతల నిలయమైన నడిచే ప్రత్యక్ష దైవం శ్రీ గోమాత అనుగ్రహం కలగాలని ఆశీర్వదించి, ధన్యవాదాలు తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుడు ప్రవీణ్,విద్యుత్ నిర్వహణ కార్మికుడు రాజులకు న్యాయం చేయలని కమిషనర్ కు వినతి.


రాజేంద్రనగర్, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) :



సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆంతరంగిక నార్సింగి సర్కిల్ -45 పరిధిలోని వార్డు 128 నెక్నాంపూర్ ఫ్రెండ్స్ కాలనీలోని మెడ్‌ప్లస్ సమీపంలో ఔటసోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుడు ప్రవీణ్,మణికొండ బస్‌స్టాప్ వద్ద విద్యుత్ నిర్వహణ కార్మికుడు రాజు విధి నిర్వహణలో తగిన వ్యక్తిగత రక్షణ పరికరాలు (పి.పి.ఈ)లేకుండా పనిచేసిన దరిమిలా విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడటం అత్యంత ఆందోళనకరం అన్నారు.బాధితులిద్దరికీ తక్షణ వైద్య సహాయం అందించి,వర్తించే జీమా ప్రయోజనాలు,చట్టబద్ధమైన పరిహారం మంజూరు చేయాలని కోరారు,మున్సిపల్ కాంట్రాక్టు నిబంధనల ప్రకారం సంబంధిత మున్సిపల్ డిప్యూటీ కమిషనర్,మెడికల్ హెల్త్ ఆఫీసర్,విద్యుత్ భద్రతా అధికారులతో తక్షణ సంయుక్త విచారణ జరిపించి భద్రతా లోపాలు,పర్యవేక్షణ వైఫల్యాలకు కారణ బూతులైన వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు డిమాండ్ చేస్తూ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.

పొగాకు రహిత యువతే మనందరి లక్ష్యం





నిజామాబాద్, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) :

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని జీవనశైలి వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ భుజంగరావు అధ్యక్షతన నిర్వహించినట్లు వైద్యాధికారినీ డా.అంజన తెలియజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ భుజంగారావు మాట్లాడుతూ....గతంలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై,చేపట్టిన చర్యలపై సమీక్షించారు.అక్టోబర్ 28న ప్రారంభమైన టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ లో భాగంగా రెండు నెలల,లేదా 8 వారాల కార్యక్రమాన్ని నాలుగు విభాగాలుగా విభజించి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.ఒకటి,రెండు వారాలు ఇన్ఫర్మేషన్,ఎడ్యుకేషన్,కమ్యూనికేషన్,కరపత్రాలు పోస్టర్లు వివిధ పద్ధతుల ద్వారా విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు.తర్వాతి మూడు నాలుగు వారాలు పాఠశాల,కళాశాల,యూనివర్సిటీలలో మొదలగు ప్రాంతాల్లో యువతకు విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు.5 6 వారాల్లో టొబాకో ఫ్రీ గ్రామాలుగా మార్చే ప్రయత్నాలు చేయాలన్నారు.చివరి ఏడు,ఎనిమిది వారాల్లో విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో టొబాకో ఉత్పత్తులను మైనర్లకు అమ్మారాదని,చట్టం నియమ నిబంధనలు ఉల్లంఘించి విద్యాసంస్థల వద్ద పొగకు ఉత్పత్తులు అమ్మే వాటిపై జరిమానా విధించాలని ఎన్ఫోర్స్మెంట్ స్క్వాడ్కు సూచించారు.ప్రతి విద్యా సంస్థలో టొబాకో ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ గైడ్లైన్స్ ప్రకారం ప్రహరీ క్లబ్బుల నిర్మాణం జరగాలన్నారు,గత సమావేశంలో కంటే 20% స్క్వాడ్ రైడింగ్ లను పెంచాలని సూచించారు.కాలేజీ,విద్యాసంస్థల్లో పొగాకు వల్ల కలిగే అనర్థాలు,ప్రహరీ క్లబ్బుల వివరాలు ప్రదర్శించాలన్నారు.టొబాకో ఫ్రీ జోన్లుగా ప్రకటించాలని సూచించారు.18 సంవత్సరాల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు,సిగరెట్ స్మోకింగ్ వంటి వాటికి అలవాటు పడకుండా అవగాహన కలిగించాలని,బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదన్నారు.జిల్లాస్థాయిలో టొబాకో సెల్ ఏర్పాటు చేయాలని,ఇంజనీరింగ్ కాలేజీ,ప్రొఫెషనల్ కాలేజీ,యూనివర్సిటీలలో తప్పకుండా అవగాహన కలిగించాలీ అన్నారు.జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వాడకంకు ప్రభావితం అవుతున్న ప్రదేశాలను గుర్తించి,అక్కడ ఇంకా ఎక్కువ స్థాయిలో అవగాహన కలిగించాలి అన్నారు.ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సర్క్యులర్ ద్వారా సమాచారాన్ని అందించాలన్నారు.పాఠశాల,కళాశాలలే ప్రధానం కాబట్టి తదుపరి సమావేశానికి డిఇఓ,డిఐఓను హాజరయ్యేలా చూడాలన్నారు.పొగాకు పంటలను పండించడం మానుకోవాలన్నారు.జిల్లాస్థాయి సైకియాట్రిస్ట్ డాక్టర్ రవితేజ మాట్లాడుతూ..నికోటిన్ కు ప్రత్యామ్నాయంగా ఉన్న టాబ్లెట్లు,చప్పరించే మాత్రలు,నికోటిన్ ప్లాస్టిక్ స్టిక్కర్స్ మొదలగు వాటిని ఉపయోగించి సిగరెట్ అలవాట్లను మాన్పించవచ్చని,అవసరమైన వారికి జిల్లాస్థాయిలో డి అడిక్షన్ సెంటర్లో చికిత్స అందిస్తున్నామన్నారు.గత జూన్ మాసం నుండి ఇప్పటివరకు అనేక అవగాహన కార్యక్రమాలను పాఠశాల,కళాశాల,అనాధ ఆశ్రమా లలో నిర్వహించామని,అవగాహన ర్యాలీలను కూడా తీసామని అన్నారు.చాలా గ్రామాల్లో 50 నుండి 60% పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడిన యువత ఉన్నారని,స్మోకింగ్,డ్రింకింగ్ చట్టపరంగా అనుమతులు ఉండడం వల్ల అవగాహన కలిగించడమే అసలైన ఆయుధంగా ఉందన్నారు.మా తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉన్న ఉద్యోగులు,ఇతర వ్యక్తులు నికోటిన్ కు అలవాటు పడుతున్నారని,వీరు టాబ్లెట్స్ వాడడం ద్వారా స్మోకింగ్ మానవచ్చు అన్నారు.జిల్లా స్థాయిలోని డి అడిక్షన్ కేంద్రానికి ఎక్కువగా బాల్కొండ,ఆర్మూర్,సిరికొండ ప్రాంతాలలో యువత స్మోకింగ్,గంజాయి,మత్తుపదార్థాలకు బానిసై రిఫర్ చేయబడుతున్నారన్నారు.కార్యక్రమ వివరాలను ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకన్న వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామనారాయణ,ఏ ఈ ఓ చక్రపాణి,ఫుడ్ ఇన్స్పెక్టర్ సవిత,రెడ్ క్రాస్ మెంబర్ ఆంజనేయులు,అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నవీన్,పోలీస్ అధికారి ఎస్ఎం అలీ,వైద్యాధికారి సుధాకర్,సిఎంఓ శ్రీనివాసరావు,మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కమర్ అహ్మద్,డిహెచ్ఈ గన్ పూర్ వెంకటేశ్వర్లు,ఎన్సిడి కోఆర్డినేటర్ వెంకటేశం,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలి

- కేశంపేటలో వివిధ గ్రామాల సర్పంచుల డిమాండ్.. ప్రభుత్వానికి విజ్ఞప్తి

కేశంపేట, నవంబరు 10 (జర్నలిస్ట్ ఫైల్) :



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రామ సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలని కేశంపేట మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేశంపేట మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు.గ్రామ పంచాయతీల ప్రథమ పౌరులుగా గ్రామీణ అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ గ్రామాభివృద్ధి కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి సర్పంచులకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లేక పోవడం ప్రజాస్వామ్య భాగస్వామ్యంలో లోటుగా భావిస్తున్నామని అన్నారు.ఎంపీటీసీలకు ఉన్నట్లుగానే సర్పంచులకు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేలా సంబంధిత చట్టాల్లో అవసరమైన మార్పులు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సర్పంచుల హక్కుల సాధన కోసం తెలంగాణ రాష్ట్రంలోని సర్పంచులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గ్రామ స్వరాజ్యం బలోపేతం కావాలంటే సర్పంచులకు సముచిత గౌరవంతో పాటు తగిన అధికారాలు, హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో తొమ్మిది రేకుల సర్పంచ్ కవితా కరుణాకర్ రెడ్డి, నిడుదవెల్లి సర్పంచ్ చెదురువెల్లి భాస్కర్ గౌడ్, దత్తాయిపల్లి సర్పంచ్ భాస్కర్, బోధ నంపల్లి సర్పంచ్ ఎద్దుల నాగేశ్వరరావు, పుటోనిగూడ సర్పంచ్ చంలీ భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరికో పుట్టిన పసిపిల్లలను తీసుకొని బిక్షాటన చేస్తున్న ముఠాకు నగదు రూపంలో ఇవ్వద్దు: బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి.

రాజేంద్రనగర్,నవంబరు10(జర్నలిస్ట్ ఫైల్):



ఎవరికో పుట్టిన పసిపిల్లలను తీసుకొనిభారత దేశం అంతటా నగదు భిక్షాటన చేస్తున్న వారికి ఎలాంటి నగదు రూపంలో బిక్షం వేయ కూడదని శంషాబాద్,కొత్వాల్ గూడ డివిజన్ల బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి తెలిపారు.కొందరు భిక్షగాళ్లకు ఆహారం,నీరు ఇస్తాము,కానీ ఒక్క రూపాయి కూడా నగదు రూపంలో ఇవ్వము అని ముంబై,పూణే,మహా రాష్ట్ర అంతటా ఒక ప్రత్యేకమైన ఉద్యమం ప్రారంభమైందని ఆయన సూచించారు.భిక్షగాడు ఎవరైనా సరే.ఎవరైనా (స్త్రీ,పురుషుడు,వృద్ధులువికలాంగులు,పిల్లలు) భిక్షాటన చేస్తుంటే,మేము వారికి ఆహారం +నీరు ఇవ్వాలని సూచించారు.కానీ నగదు సహాయం మాత్రం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని ఆయన తెలిపారు. ఫలితంగా, అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి భిక్షాటన మాఫియా బృందాలు నిర్వీర్యమవుతాయని ఆయన సూచించారు,పిల్లల అపహరణ కేసులు వాటంతట అవే తగ్గుతాయి ఆయన తెలిపారు.అటువంటి నేర సమూహాలు పూర్తిగా నాశనం చేయబడతాయని అన్నారు.దయచేసి ఎవరికీ భిక్ష రూపంలో ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దు అని సూచించారు.మీరు ఈ విషయాన్ని బలంగా విశ్వసిస్తే,మీ వాహనంలో 3 లేక 5 బిస్కెట్ల ప్యాకెట్లు,చాక్లెట్లు..ఉంచుకోండి,కానీ డబ్బు ఇవ్వవద్దు అన్నారు.మీరు ఈ ప్రచారానికి మద్దతు ఇస్తే,ఈ సందేశాన్ని కనీసం 10 మందికి కనీసం 3 గ్రూపులలో పంచుకోండి.మీకు ఈ ఆలోచన నచ్చితే,దయచేసి ఫార్వార్డ్ చేయండి.రాజస్థాన్‌లో ఈ ప్రచారం విజయవంతమైందని ఆయన సూచించారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు..!

- ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలి:జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

రంగారెడ్డి,నవంబరు 10(జర్నలిస్ట్ ఫైల్):



ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి,నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులు,వినతులను స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులపై అధికారులు తక్షణమే స్పందించాలని,పరిష్కారంలో జాప్యం చేయకుండా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 26 ఫిర్యాదులు అందగా,వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 19,ఇతర శాఖలకు సంబంధించి 7 దరఖాస్తులు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు డాక్టర్ కె.కిరణ్మయి,చంద్ర రెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐఓఏ అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా పీవీ సింధు ఎన్నిక అభినందనీయం



- క్రీడా రంగానికి గర్వకారణం.. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఎన్నిక కావడం పట్ల రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీవీ సింధుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అథ్లెట్స్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఎన్నిక కావడం కూడా అభినందనీయమని పేర్కొన్నారు. ఐఓఏ జనరల్ బాడీలో అథ్లెట్ ప్రతినిధులుగా మీరాబాయి చాను, సాజన్ ప్రకాశ్ ఎంపిక కావడం భారత క్రీడారంగానికి గర్వకారణమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన క్రీడాకారులకు కీలక బాధ్యతలు దక్కడం సంతోషకరమని, వారి నాయకత్వంలో భారత క్రీడారంగం మరింత బలోపేతం అవుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

పకడ్బందీగా జనగన-2027 ప్రక్రియ



- జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె ఖాజావలి

గుంటూరు, నవంబర్ 10(జర్నలిస్ట్ ఫైల్): జనాభా గణన – 2027 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు సమాయత్తం కావాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె ఖాజావలి సూచించారు.

గుంటూరు కలెక్టరేట్ లోని శంకరన్ హాల్లో భారత జనాభా గణన–2027లో భాగంగా ఫేజ్–2 జనాభా లెక్కల సేకరణకు సంబంధించి రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి ఆర్ ఓ హాజరై శిక్షణలో పాల్గొన్న జిల్లా సెన్సస్ అధికారులు, మండల స్థాయి చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లు, సెన్సస్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. జనాభా గణన ప్రక్రియలో ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జనాభా లెక్కల సేకరణలో ఖచ్చితత్వం, సమన్వయం, బాధ్యతాయుతమైన విధి నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నవంబర్ 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిశీచిన ఈ శిక్షణా కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ కార్యాలయం నుంచి విచ్చేసిన ప్రసన్న కుమార్ , జిల్లా కోఆర్డినేటర్స్ ఆదిలక్ష్మి , రమణ తదితరులు శిక్షణ అందించారు. కాగా ఈ కార్యక్రమంలో జిల్లా లోని పలువురు తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ విడాకుల అంశంపై అంబటి రాంబాబు స్పందన

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అన్నా కొణిదెల విడాకుల వ్యవహారం ఇరు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. ఈ అంశంపై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికరంగా స్పందించారు. పవన్ కల్యాణ్ వివాహాలు, విడాకులు అనేవి పూర్తిగా ఆయన వ్యక్తిగత విషయమని, వాటి గురించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని అంబటి రాంబాబు స్పష్టం చేశారు. ఈ అంశంపై మాట్లాడేందుకు నిరాకరించారు. కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ విడాకుల అంశంపై విలేకరులు ప్రశ్నించగా, అంబటి ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో అంబటి రాంబాబుపై గతంలో కేసు నమోదైంది. 2026 జూలై 15న ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముద్రగడ భౌతికకాయానికి పోలీసులు ప్రభుత్వ లాంఛనాలతో గౌరవ వందనం ఇచ్చేందుకు ప్రయత్నించగా, వైసీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఆ సమయంలో పోలీసు విధులను అడ్డుకున్నారంటూ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్సై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 కింద నోటీసులు అందుకున్న అంబటి రాంబాబు ఈరోజు విచారణకు హాజరయ్యారు. పోలీసులు సుమారు గంటన్నర పాటు ఆయనను విచారించారు. అనంతరం బయటకు వచ్చిన అంబటి మాట్లాడుతూ.. తాను పోలీస్ స్టేషన్‌కు హాజరుకావడం కొత్తేమీ కాదన్నారు. ముద్రగడ కుటుంబ సభ్యులు వద్దని చెప్పినప్పటికీ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి భౌతికకాయం వద్ద గౌరవ వందనం చేసేందుకు ప్రయత్నించారని, దాన్ని తాము అడ్డుకున్నామని వివరించారు. అదే సమయంలో పవన్ కల్యాణ్ అంశాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా, అది ఆయన వ్యక్తిగత వ్యవహారమని, దానిపై స్పందించేది లేదని తేల్చిచెప్పారు.

తిరుపతి డీజీపీ-ఐజీపీ సదస్సులో యోగాకు ప్రత్యేక ప్రాధాన్యం

- ప్రధాని మోదీ యోగా ప్రోత్సాహానికి అనుగుణంగా మూడు రోజుల ప్రత్యేక సాధన
- పోలీసు ఉన్నతాధికారుల శారీరక, మానసిక ఆరోగ్యానికి ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- కామన్ యోగా ప్రొటోకాల్ ప్రకారం 45 నిమిషాల పాటు సాధన
- మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్): తిరుపతిలో జరగనున్న అఖిల భారత డీజీపీ–ఐజీపీ సదస్సులో యోగాకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ యోగాను ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చి, నిత్యజీవితంలో భాగం చేయాలన్న ఆశయానికి అనుగుణంగా మూడు రోజుల పాటు ప్రత్యేక యోగా సాధన నిర్వహించనున్నారు. విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు ఉన్నతాధికారుల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించేలా రాష్ట్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి జరుగుతున్న ఏర్పాట్లు గురించి అధికారులతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ మంగళవారం చర్చించారు. యోగా సాధన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) ప్రాంగణంలో అఖిల భారత డీజీపీ–ఐజీపీ సదస్సు జరగనుంది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సహా పలువురు ప్రముఖులు, దేశవ్యాప్తంగా పోలీసు ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. జాతీయ స్థాయి సమావేశంలో యోగా కార్యక్రమాలను భాగం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించనున్నారు.

పోలీసు అధికారులు శాంతిభద్రతలు, అంతర్గత భద్రత, అత్యవసర పరిస్థితుల నిర్వహణ వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తుంటారు.

ఈ క్రమంలో ఎదురయ్యే పని ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగా దోహదపడుతుంది. శ్వాస నియంత్రణ, ఏకాగ్రత, శరీరాన్ని చురుకుగా ఉంచే సాధనల ద్వారా అధికారుల్లో ఉత్సాహం, మానసిక సమతుల్యత పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ఆయుష్ శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థతో పాటు అమరావతిలోని మంతెన ఆశ్రమం నుంచి ప్రత్యేక యోగా నిపుణుల బృందాలు పాల్గొననున్నాయి. ఈ బృందాలు సదస్సుకు హాజరయ్యే అధికారులకు యోగా సాధన చేయించడంతో పాటు వివిధ విధానాలను వివరించనున్నాయి.

కామన్ యోగా ప్రొటోకాల్ ప్రకారం సాధన

సదస్సులో ప్రతిరోజూ ఉదయం నిర్ణీత సమయంలో ప్రశాంత వాతావరణంలో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన కామన్ యోగా ప్రొటోకాల్ ప్రకారం 45 నిమిషాల పాటు సాధన సాగనుంది. ఇందులో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి ప్రక్రియలకు చోటు కల్పించనున్నారు. పోలీసు అధికారుల పని ఒత్తిడిని తగ్గించి, శారీరక చురుకుదనం, మానసిక ప్రశాంతత పెంపొందించేలా కార్యక్రమాన్ని రూపొందించారు.

జాతీయ సంస్థకు చెందిన నిపుణులతో శిక్షణ

యోగా కార్యక్రమాల నిర్వహణ కోసం మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థకు చెందిన నీతూ సైనీ, పి. సుందర్ రాజు, ఖుష్బూ శర్మ, శుభం ఆర్యలను యోగా శిక్షకులుగా, రాహుల్ సింగ్ చౌహాన్‌ను ఆంగ్ల వ్యాఖ్యాతగా నియమించారు. వీరితో పాటు మంతెన ఆశ్రమానికి చెందిన నిపుణుల బృందం యోగా ప్రదర్శన, సాధన కార్యక్రమాల్లో పాల్గొననుంది.

జాతీయ స్థాయి సదస్సులో యోగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ డైరెక్టర్ డాక్టర్ జ్యోతి కేస్వానీ రాష్ట్ర ఆయుష్ శాఖ కమిషనర్‌కు లేఖ ద్వారా సూచించారు. యోగాపై ప్రధాని నరేంద్ర మోదీ చూపుతున్న ప్రత్యేక ఆసక్తి, భారతీయ యోగాకు అంతర్జాతీయ స్థాయిలో లభిస్తున్న గుర్తింపు నేపథ్యంలో ఈ సదస్సులో యోగా కార్యక్రమాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయాలు జరగాలి





- రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులకు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ ఆదేశం

గుంటూరు, నవంబర్ 10(జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో బియ్యం ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు బియ్యం విక్రయాలు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరలను మరోసారి వివరించి, నిర్ణీత ధరలకు మించి విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బియ్యం రకాల వారీగా కిలో ధరలు వరుసగా బీపీటీ (సోనా, సాంబా), కేఎన్ఎం రకాలు – రూ. 66, హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలు – రూ. 76, స్వర్ణ మసూరి – రూ. 47, జై శ్రీరామ్ – రూ. 82 లకు అందిస్తున్నామన్నారు.ప్రతి బియ్యం దుకాణం, మిల్లుల వద్ద వివిధ రకాల ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా లేదా అనే అంశంపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు.బియ్యం విక్రయాల్లో అక్రమాలు, అధిక ధరల వసూళ్లు, తూనికలు, కొలతల్లో మోసాలు జరగకుండా తూనికలు, కొలతల శాఖ, పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, జీఎస్టీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అలాగే జిల్లాలో ఇప్పటికే ఆరు ధరణి బియ్యం అమ్మకం కేంద్రాలు రైతు బజార్లలో పనిచేస్తున్నాయని, వాటి ద్వారా ఇప్పటివరకు సుమారు 4,500 మంది వినియోగదారులకు 1,150 క్వింటాళ్ల కేఎన్ఎం/బీపీటీ రకాల బియ్యం విక్రయించినట్లు తెలిపారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో అదనంగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మశ్రీ, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎన్.నాగేశ్వరరావు, ఇతర అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు..

మెడికో లీగల్ కేసుల దర్యాప్తుపై పోలీసులకు ప్రత్యేక శిక్షణ





- శాస్త్రీయ ఆధారాల సేకరణ, పోస్టుమార్టం విధానాలు, డిజిటల్ డాక్యుమెంటేషన్‌పై అవగాహన
- రెండు రోజుల శిక్షణలో పాల్గొన్న 30 మంది పోలీస్ అధికారులు, 10 మంది వైద్య సిబ్బంది

గుంటూరు, నవంబర్ 10(జర్నలిస్ట్ ఫైల్): మెడికో లీగల్ కేసుల నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలు, శాస్త్రీయ ఆధారాల సేకరణపై పోలీస్ అధికారులకు అవగాహన కల్పించేందుకు గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు, రాష్ట్ర సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ జి.వి. రమణమూర్తి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంభమైంది. మెడికో లీగల్ కేసెస్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్, సీసీఎస్ డీఎస్పీ ఏ. శివాజీ సమన్వయంతో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రమోద్ కుమార్‌తో పాటు అశోక్ కుమార్, రమేష్ బాబు, వైద్య బృందం శిక్షణలో పాల్గొన్నారు.

ఈ నెల 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ కొనసాగనుంది. మెడికో లీగల్ కేసుల నిర్వహణ, పోస్టుమార్టం పరీక్షల సమయంలో పాటించాల్సిన విధానాలు, పోస్టుమార్టం ప్రక్రియ వీడియోలు, ఫొటోగ్రఫీ, వైద్యపరమైన పత్రాలు, నివేదికల తయారీ, డిజిటల్ సర్టిఫికేషన్ తదితర అంశాలను నిపుణులు వివరించారు.

శిక్షణలో భాగంగా కేసులపై గ్రూప్ చర్చలు, వీడియో ఇంటరాక్షన్, డిజిటల్ ఎంట్రీ ప్రాక్టీస్, ప్రాక్టికల్ డెమోలను నిర్వహించారు. మెడికో లీగల్ కేసుల్లో ఆధారాలను సక్రమంగా సేకరించడం, వాటిని శాస్త్రీయ పద్ధతిలో నమోదు చేయడం, న్యాయస్థానాల్లో సమర్పించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.

మంగళవారం జరిగిన శిక్షణలో సుమారు 30 మంది పోలీస్ అధికారులు, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగానికి చెందిన 10 మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టుల్లో కేసులను సమర్థవంతంగా నిరూపించేందుకు శాస్త్రీయ ఆధారాల సేకరణ, సరైన డాక్యుమెంటేషన్ కీలకమని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఈ శిక్షణ దర్యాప్తు నాణ్యతను మెరుగుపరిచేందుకు, న్యాయస్థానాల్లో ఆధారాలను సమర్థంగా సమర్పించేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

40 కిలోమీటర్ల మేర గుంటూరు నగరంలో భారీ ప్లాంటేషన్ డ్రైవ్



- హరిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- నగర కమిషనర్ కె. మయూర్ అశోక్

గుంటూరు, నవంబర్ 10(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరాన్ని హరితమయంగా, సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు గాలి నాణ్యతను మెరుగుపరిచి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భారీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.

నగరంలో పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతకు దోహదపడేలా ఈ కార్యక్రమాన్ని రెండు దశల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

నగరవ్యాప్తంగా 40 కిలోమీటర్లకు పైగా ఉన్న రహదారి డివైడర్లలో మొక్కలు నాటే పనులు చేపట్టినట్లు వివరించారు. మొదటి దశలో 25 కిలోమీటర్లు, రెండో దశలో మరో 15 కిలోమీటర్ల మేర ప్లాంటేషన్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే ఉన్న మొక్కలను అందంగా ట్రిమ్మింగ్ చేయడంతో పాటు, వాటి కింద శ్రబ్ ప్లాంటేషన్ పనులను కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు. గుంటూరు వాతావరణంలో అధిక వేసవి ఉష్ణోగ్రతలను తట్టుకోవడంతో పాటు తక్కువ నీటితో పెరిగే, జంతువుల వల్ల నష్టం వాటిల్లని మొక్కల రకాలను ఏపీ గ్రీన్ కార్పొరేషన్ నిపుణుల సలహాలతో ఎంపిక చేసినట్లు చెప్పారు. డివైడర్లలోని పాత మట్టిని తొలగించి, నాణ్యమైన ఎర్రమట్టి, అవసరమైన ఎరువులను వినియోగించి మొక్కలను నాటుతున్నట్లు వివరించారు.

ఈ ప్రాజెక్టు అమలుకు సుమారు రూ. 5 నుంచి రూ. 6 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. మొక్కలు నాటడంతోనే కార్యక్రమం ముగియదని, వాటి పెరుగుదల, సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. నాటిన మొక్కలను రాబోయే రెండేళ్లపాటు సంరక్షించే బాధ్యతను కాంట్రాక్టు నిబంధనల్లో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్లకే అప్పగించినట్లు వెల్లడించారు.

మొక్కలు, కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారుల వివరాలతో కూడిన సైన్‌బోర్డులను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కమిషనర్ స్పష్టం చేశారు. నగరంలో పచ్చదనాన్ని పెంచి స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

ఏపీ వైపు మరో అల్పపీడనం.. దక్షిణ కోస్తా, రాయలసీమకు వర్షసూచన

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈనెల 13న కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇది ఏర్పడిన 24 గంటల్లోనే మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా, ఆపై వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అనంతరం ఇది పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం

ఈ అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే భారీ వర్షాల కంటే ఎక్కువగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ద్రోణి కొనసాగుతుండటంతో రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ఉద్దేశించిందే 'మార్పు' కార్యక్రమం



- వచ్చే ఏప్రిల్ నాటికి పనులన్నీ పూర్తి చేయాలి
- పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ

గుంటూరు, నవంబర్ 10(జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు 'మార్పు' కార్యక్రమం కింద చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఆయా పనులు చేపట్టాలన్నారు. వసతి గృహాల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు, వర్షపు నీటి సంరక్షణ కోసం రైన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థల నిర్మాణం, మొక్కల పెంపకం, పరిసరాల సుందరీకరణ వంటి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. చేపట్టే ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులు పూర్తయిన తర్వాత విద్యార్థులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా ఉండాలని స్పష్టం చేశారు.

వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి వసతి గృహాల్లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని అధికారులను కోరారు . ఆయా వసతి గృహాలకు కేటాయించిన శాఖల ఇంజనీర్లు పనుల అమలులో పూర్తి బాధ్యత తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం బయోచార్ తయారీ, వినియోగం, సంబంధిత పనుల పురోగతిపై కూడా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. బయోచార్‌కు సంబంధించి చేపట్టిన కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి, డి ఆర్ డి ఎ, డ్వామా పిడీలు వి. శంకర్, విజయలక్ష్మి, జిల్లా సాంఖిక సంక్షేమ సాధికారత అధికారి డి. దుర్గాభాయి, , జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎన్. వెంకటరవణప్ప, హార్ట్ ఫుల్ నెస్ ఫౌండేషన్ డి. పి. ఎం హారిక తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

పంచాయతీ ఎన్నికల్లోనూ బీజేపీ సత్తా చాటాలి

- గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి
- స్థానిక సంస్థల విజయాలతో బీజేపీ కార్యకర్తల్లో నూతనోత్సాహం
- పంచాయతీ ఎన్నికలకు సమాయత్తం కావాలని రాష్ట్ర నాయకత్వం పిలుపు



విజయవాడ, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయాల స్ఫూర్తితో రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని, గ్రామస్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. విజయవాడలోని ఐవీ ప్యాలెస్‌లో మంగళవారం నిర్వహించిన పంచాయతీ ఎన్నికల సమాయత్త రాష్ట్రస్థాయి సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొని జిల్లా స్థాయి నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ--జనసేన--బీజేపీ కూటమి ప్రభంజనం స్పష్టంగా కనిపించిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. కూటమి సమన్వయంతో బీజేపీకి స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం పెరిగిందని, జెడ్పీటీసీ ఎన్నికల్లో 33 స్థానాల్లో పోటీ చేసి సుమారు 23 స్థానాలు గెలుచుకోవడం, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 355 మంది బీజేపీ ప్రజాప్రతినిధులు ఎన్నిక కావడం పార్టీ విస్తరణలో కీలక ముందడుగు అని తెలిపారు.

పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగకపోయినా ప్రతి గ్రామంలో బీజేపీకి ప్రాతినిధ్యం ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 14వ, 15వ ఆర్థిక సంఘాల ద్వారా గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు అందించిందని, ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం కలిగిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధుల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ, ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బీజేపీ ప్రస్థానం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదగడం వెనుక వేలాది మంది కార్యకర్తల త్యాగాలు, కృషి ఉన్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులు తమతో పాటు పనిచేసిన కార్యకర్తలను ఎప్పటికీ మర్చిపోకూడదని సూచించారు. పదవులు వచ్చిన తర్వాత కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. వ్యక్తిగత ఎదుగుదల కంటే పార్టీ బలోపేతానికి ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్ నాయకత్వాన్ని గ్రామస్థాయి నుంచి తయారు చేయాలని పిలుపునిచ్చారు.

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ, గతంలో రాష్ట్రంలో బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికలకు పరిమితంగా ప్రాధాన్యత ఇచ్చేదని, ప్రస్తుతం రాష్ట్ర నాయకత్వం సమన్వయంతో గ్రామస్థాయి కార్యకర్తలకు సైతం ప్రజాప్రతినిధులుగా ఎదిగే అవకాశాలు కల్పిస్తోందన్నారు. సాధారణ కార్యకర్తలు కూడా సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా ఎదగాలన్నదే పార్టీ లక్ష్యమని చెప్పారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రతి మండలంలో బీజేపీకి ప్రాతినిధ్యం ఉండాలని, ప్రతి గ్రామంలో కనీసం ఒకరిద్దరు బీజేపీ వార్డు సభ్యులు ఎన్నికయ్యేలా కృషి చేయాలని కోరారు. అనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ చేసిన కృషిని అభినందిస్తూ, ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను విశ్లేషించుకుని కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు.

రాష్ట్ర మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాబోయే పంచాయతీ ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వేల సంఖ్యలో గ్రామ పంచాయతీలు ఉన్నందున క్షేత్రస్థాయిలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు పరస్పరం చర్చించుకుని సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ తరఫున జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, కూటమి సమన్వయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మరింత బలపడిందన్నారు. తక్కువ స్థానాల్లో పోటీ చేసినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణకు ఈ ఎన్నికలు దోహదపడ్డాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తలు ప్రజా నాయకులుగా ఎదిగేందుకు స్థానిక సంస్థల ఎన్నికలు గొప్ప అవకాశాన్ని కల్పించాయని, అభివృద్ధి కార్యక్రమాల్లో బీజేపీ బలమైన పాత్ర పోషిస్తోందని తెలిపారు.సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయాలను సమీక్షించడంతో పాటు రాబోయే పంచాయతీ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, కూటమి పార్టీల మధ్య సమన్వయం, గ్రామస్థాయిలో పార్టీ విస్తరణ, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం తదితర అంశాలపై నాయకులు చర్చించారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి వై. సత్యకుమార్ యాదవ్‌లను గజమాలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.తెలుగు రాష్ట్రాల సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ బిజెపి సంస్థాగత బలోపేతం పై దిశానిర్దేశం చేశారు.ఎమ్మెల్యేలు సి ఆదినారాయణ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు,ఎస్ దయాకర్ రెడ్డి, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న,మట్టా ప్రసాద్ తదితరులు కార్యనిర్వహణ లో భాగస్వాములు అయ్యారు

తెలుగు సాహిత్య వికాసానికి సి.పి. బ్రౌన్ విశేష సేవలు



- తెలుగు భాషాభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు: మంత్రి కందుల దుర్గేష్

అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్): తెలుగు సాహిత్య వికాసానికి విశేష సేవలందించిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సి.పి. బ్రౌన్) జయంతి సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఘన నివాళులర్పించారు. విదేశీయుడైనప్పటికీ తెలుగు భాషపై అపారమైన ప్రేమాభిమానాలు పెంచుకుని, దాని అభివృద్ధి, వ్యాప్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు బ్రౌన్ అని కొనియాడారు.

తెలుగు భాషకు తొలి ప్రామాణిక నిఘంటువును రూపొందించి, భాషా వికాసానికి పునాది వేసిన ఘనత సి.పి. బ్రౌన్‌కు దక్కుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రాచీన తెలుగు సాహిత్య సంపదను సేకరించి, అనేక కావ్యాలు, గ్రంథాలను భవిష్యత్ తరాలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఆయన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. తెలుగు సాహిత్య పరిరక్షణలో బ్రౌన్ చేసిన కృషి ఎప్పటికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సి.పి. బ్రౌన్ చూపిన మార్గంలో పయనిస్తూ మాతృభాష తెలుగు గొప్పదనాన్ని చాటడంతో పాటు, దాని అపారమైన సాహిత్య సంపదను పరిరక్షించి భావితరాలకు అందించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

11 వేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు హర్షణీయం - ప్రభుత్వానికి కృతజ్ఞతలు



- ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం
- ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్

అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 11 వేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే నిర్ణయం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దీర్ఘకాలంగా పెన్షన్ సమస్యపై ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనిస్తుందని, ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య అభినందనీయమని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, 11 వేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ అమలుకు నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి మరియు సంబంధిత ప్రభుత్వ పెద్దలకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

అదేవిధంగా, ఈ సమస్య పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసి, ప్రభుత్వ స్థాయిలో ఉద్యోగుల తరఫున తమ వాణిని వినిపించిన ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి. రామకృష్ణ గారికి ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉద్యోగుల సంక్షేమం, పెన్షన్ భద్రత, వారి న్యాయమైన హక్కుల సాధన కోసం ప్రభుత్వం ఇదే సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని, మిగిలిన ఉద్యోగుల పెన్షన్ సంబంధిత సమస్యలను కూడా పరిష్కరించాలని నల్లపల్లి విజయ్ భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు.

మహిళా ఉద్యోగులకు ఎన్జీజీఓ అసోసియేషన్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



- ఈ నెల 16 నుంచి 19 వరకు వైద్య శిబిరం.. అనుమతించిన కలెక్టర్

గుంటూరు, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్): ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మహిళా ఉద్యోగులకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ పరీక్షలు అందుబాటులో ఉంటాయి.

ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆహ్వానించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు వైద్య పరీక్షలు చేయించుకునేందుకు కలెక్టర్ అనుమతి మంజూరు చేశారు.

మహిళా ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ, క్యాన్సర్ వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. మహిళా ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, గుంటూరు నగర అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, నగర కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా మహిళా చైర్మన్ తాజ్నిస్సా తదితరులు పాల్గొన్నారు.

జనగణన సర్వేను ఖచ్చితత్వంతో, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ



గుంటూరు, నవంబర్ 10(జర్నలిస్ట్ ఫైల్): జనగణన సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి ఖచ్చితత్వంతో, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ అధికారులకు సూచించారు.

మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని శంకరన్ హాల్లో జిల్లా సెన్సెస్ అధికారులు, మండల స్థాయి చార్జ్ ఆఫీసర్లు, అదనపు ఛార్జ్ ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు జనాభా గణన- 2027 పై నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రశ్నావళిలోని 40 ప్రశ్నలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని, ప్రతి ప్రశ్నకు ఒకే ప్రామాణిక విధానంలో సమాధానాలు నమోదు చేయాలని తెలిపారు. నమోదులో వ్యక్తిగత విచక్షణకు తావులేకుండా, ఎలాంటి సందేహాలున్నా శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

సెల్ఫ్ ఎన్యుమరేషన్, ఇంటింటి సర్వే, రివిజనల్ రౌండ్‌లను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలన్నారు. మొదటి రోజు నుంచే ప్రతి ఎన్యుమరేటర్ రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని విధులు నిర్వహించాలని, చివరి రోజుల్లో హడావుడి పడకుండా నిరంతరం పురోగతిని పర్యవేక్షించాలన్నారు. రోజుకు సగటున నాలుగు నుంచి పది ఇళ్ల వివరాలను నమోదు చేయడం ద్వారా నిర్దిష్ట సమయంలో సర్వేను పూర్తి చేయవచ్చని తెలిపారు. 2027 జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్ లో వివరాల నమోదు, 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు హౌస్ టు హౌస్ ఫీల్డ్ ఎన్యుమరేషన్ ప్రక్రియలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు.

సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలపై ప్రత్యేక దృష్టి సారించి క్లస్టర్ల వారీగా ప్రచారం నిర్వహించి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత జనగణన డిజిటల్ విధానంలో జరుగుతున్నందున, ఆయా వివరాలను నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఒకసారి వివరాలను నమోదు చేసి సమర్పించిన తర్వాత సవరణలకు అవకాశం ఉండదని గుర్తుచేశారు. సేకరించిన సమాచారం ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, భవిష్యత్ విధానపరమైన నిర్ణయాలు రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు. డేటా నమోదు ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు ప్రతి కార్యాలయంలో ప్రత్యేక డేటా వెరిఫికేషన్ సెల్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

కుల, మత వివరాల నమోదులో ప్రభుత్వ నిబంధనలు, గెజిట్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వివరాలు నమోదు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే తహసీల్దార్లు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఖాజావలి, సెన్సస్ కేంద్ర కార్యాలయ శిక్షణ అధికారి ప్రసన్న కుమార్, జిల్లా కోఆర్డినేటర్లు ఆదిలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి కేడీసీసీ బ్యాంకు రూ.కోటి విరాళం



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : తుఫాన్ల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీ) ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.కోటి విరాళం అందించింది. బ్యాంకు కామన్ గుడ్ ఫండ్ నుంచి ఈ మొత్తాన్ని కేటాయించినట్లు బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం తెలిపారు.సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మంత్రి కొల్లు రవీంద్ర, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుతో కలిసి నెట్టెం రఘురాం కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన కోటి రూపాయల చెక్కును అందజేశారు.రైతులకు అండగా నిలిచేందుకు విరాళం అందించిన కేడీసీసీ బ్యాంకు ప్రతినిధులకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో మృతి చెందిన యువకుడి కుటుంబానికి సురేష్ బాబు పరామర్శ



కొత్తపాలెం, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్): దీపావళి పండుగ రోజున ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన కొత్తపాలెంకు చెందిన పోలిమెట్ల చందు కుటుంబ సభ్యులను సురేష్ బాబు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.చందు బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసి పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందడం కుటుంబానికి తీరని లోటని సురేష్ బాబు పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్న తల్లిదండ్రులు తమ ఏకైక కుమారుడిని ఉన్నతంగా చదివించి, పోలీసు ఉద్యోగ శిక్షణకు కూడా పంపించారని తెలిపారు.

చందు ఆకస్మిక మరణంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోవడం తనను కలచివేసిందన్నారు. కుటుంబ సభ్యులతో కొంతసేపు గడిపి వారికి మనోధైర్యం కల్పించారు. చందు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తానని సురేష్ బాబు భరోసా ఇచ్చారు.

ఎస్ఆర్ఎం వర్సిటీలో జిల్లా స్థాయి వకృత్వ పోటీలు





- ఎస్ఆర్ఎం విద్యార్థి యశ్వంత్‌కు మొదటి బహుమతి

అమరావతి, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్): ఏపీ ఎస్ఆర్ ఎం యూనివర్సిటీలో మంగళవారం జిల్లా యువజన సర్వీసుల శాఖకు చెందిన మై భారత్ జిల్లా అధికారులు వన్ నేషన్ వన్ ఎలక్షన్ అంశంపై ఇంజనీరింగ్ విద్యార్థులకు జిల్లా స్థాయి వకృత్వ పోటీలను నిర్వహించారు. గుంటూరు జిల్లా మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ దేవి రెడ్డి కిరణ్మయి పర్యవేక్షణలో ఈ పోటీలు ఘనంగా జరిగాయి. ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీ తో పాటు వివిఐటి, విజ్ఞాన్, కేఎల్ యూ, సిద్ధార్థ యూనివర్సిటీలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు 100 మందికి పైగా పోటీల్లో పాల్గొన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సతీష్ కుమార్, ఇన్చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్ లు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. మై భారత్ ఆంధ్ర ప్రదేశ్ సంచాలకులు వెంకట్ ఉజ్వల్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం విద్యార్థి యశ్వంత్ కు మొదటి బహుమతి లభించింది. కాగా విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు సర్ ఫిరోజ్, షేక్ జాకీర లు ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ గుంటూరు జిల్లా మై భారత్ అధికారులు ప్రశంసా పత్రాలను అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణతలుగా రేపతి బాలకృష్ణ, డాక్టర్ మంగళంపల్లి కిరణ్, వేణుగోపాల్ గంగిశెట్టి వ్యవహరించారు.

వినియోగదారుల అభిప్రాయాలే సేవల నాణ్యతకు కొలమానం

- తపాలా కార్యాలయాల్లో కేంద్ర మంత్రి పెమ్మసాని ఆకస్మిక తనిఖీలు



భోపాల్, నవంబర్ 10 (జర్నలిస్ట్ ఫైల్): తపాలా శాఖ సేవల నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మంగళవారం భోపాల్‌లోని రెండు ప్రధాన తపాలా కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కార్యాలయాలను సందర్శించిన ఆయన పోస్టల్ సేవల పనితీరును పరిశీలించడంతో పాటు వినియోగదారుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించారు.

తపాలా కార్యాలయాల్లో అమలవుతున్న ఆధునిక సేవలు, కౌంటర్ సర్వీసులు, టికెటింగ్ విధానం, పార్సెల్ డెలివరీ నెట్‌వర్క్, మెయిల్ నిర్వహణ వ్యవస్థల పనితీరును మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఉద్యోగులతో సమావేశమై విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, పని పరిస్థితులు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సేవల కోసం వచ్చిన వినియోగదారులతో మాట్లాడి సిబ్బంది పనితీరు, సేవల నాణ్యత, ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఇండియా పోస్ట్‌ను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. తపాలా వ్యవస్థ కేవలం ఉత్తరాల బట్వాడాకే పరిమితం కాకుండా బ్యాంకింగ్, బీమా సహా అనేక ప్రజోపయోగ సేవలను అందించే బలమైన వ్యవస్థగా విస్తరిస్తోందన్నారు.

గత రెండున్నరేళ్లుగా ఇండియా పోస్ట్‌ను మరింత పటిష్టం చేస్తూ, కార్పొరేట్ సంస్థల స్థాయిలో వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తరతరాలుగా ప్రజలు పోస్టల్ వ్యవస్థపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పూర్తిస్థాయి వినియోగదారుల కేంద్రకృత విధానంతో ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు.

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత విస్తరిస్తున్నామని, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను డిజిటల్ విధానంలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ సేవలపై ప్రత్యేక సమీక్ష

తపాలా కార్యాలయాల తనిఖీల అనంతరం భోపాల్ పరిధిలోని బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్, సాంకేతిక మౌలిక సదుపాయాల పనితీరును మంత్రి సమీక్షించారు. వినియోగదారులకు నిరంతరాయంగా హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ, మెరుగైన టెలికాం సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అందించే సేవల్లో నాణ్యత, వేగం, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com